



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 214 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 10 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 214 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 10 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## నవనీత కృష్ణాలంకారంలో రామయ్య ముగ్ధమనోహర రూపం





ఒంటిమిట్ట పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 9. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం నవనీత కృష్ణాలం కారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు,

వివరాలు 2లో..







- రాజధానిలోని వెలగపూడిలో చంద్రబాబు కొత్త ఇల్లు
- లాంఛనంగా శంకుస్థాపన
- హాజరైన చంద్రబాబు కుటుంబ సభ్యులు
- ముఖ్యమంత్రి కొత్త ఇంటి నిర్మాణ బాధ్యతలు ఎస్ఆర్ఆర్ సంస్థకు అప్పగింత

# సీఎం చంద్రబాబు ఇంటి నిర్మాణానికి భూమిపూజ..

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని అమరావతిలో సొంత ఇంటి నిర్మాణానికి సంకల్పించారు. భూమి పూజ కార్యక్రమం జరిగింది. చంద్రబాబు, నారా భువనేశ్వరి, నారా లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్ ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్ని కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీనికి సంబంధించిన వీడియోను నారా లోకేశ్ తన యూట్యూబ్ చానల్ లో అప్ లోడ్ చేశారు. చంద్రబాబు రాజధాని ప్రాంతంలోని వెలగపూడిలో సొంతంగా 5 ఎకరాల స్థలం కొనుక్కున్నారు. సచివాలయం వెనుక ఉన్న ఈ-9 రహదారికి పక్కనే ఈ స్థలం ఉంది. ఓ రైతు నుంచి ఈ స్థలం కొనుగోలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలోని వెలగపూడిలో తన నూతన నివాసానికి పునాది రాయి వేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ ప్రతిష్టాత్మకమైన ఇంటి నిర్మాణ బాధ్యతను ఏ సంస్థకు అప్పగించారనే విషయం తాజాగా వెలుగులోకి

వివరాలు 2లో..



## మాజీ మంత్రి కాకాణికి హైకోర్టులో షాక్

- క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసు
- కాకాణి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు
- క్వాష్ పిటిషన్ పై విచారణ 2 వారాలకు వాయిదా



పెన్ పవర్ డెస్క్:క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ముందస్తు బెయిల్ ను నిరాకరించింది. పోలీసుల అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన మరో పిటిషన్ (క్వాష్ పిటిషన్)పై విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

వివరాలు 2లో..

## జే బ్రాండ్లతో లివర్, కిడ్నీ సమస్యలతో వేల మంది ప్రాణాలు కోల్పోయారు

- జగన్ లిక్కర్ వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారన్న రవీంద్ర
- డిస్టిలరీలు, మద్యం షాపులను హస్తగతం చేసుకున్నారని మండిపాటు
- నూతన ఎక్సైజ్ పాలసీకి తాము శ్రీకారం చుట్టామని వెల్లడి

వివరాలు 2లో..



## మహిళల బట్టలు కూడా ఊడదీస్తామనే విధంగా జగన్ మాటలు ఉన్నాయి

- పోలీసుల బట్టలు ఊడదీస్తామన్న జగన్
- మహిళల మనోభావాలు దెబ్బతీసేలా జగన్ మాటలు ఉన్నాయన్న భవాని
- ఈ వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్



పెన్ పవర్ డెస్క్:పోలీసుల బట్టలు ఊడదీస్తామన్న వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలపై ఏపీ పోలీసు అధికారుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించిన పోలీసు అధికారుల సంఘం జగన్ వ్యాఖ్యలను ఖండించింది. ఈ సందర్భంగా మహిళా

వివరాలు 2లో..

## జగన్ ను లేకుండా చేయాలనే కుట్ర జరుగుతోంది

- జడ్ ప్లస్ సెక్యూరిటీలో ఉన్న జగన్ కు కనీస భద్రత కూడా కల్పించడం లేదన్న శ్రీకాంత్ రెడ్డి
- జగన్ ఇంటి వద్ద కూడా సరైన భద్రత లేదని విమర్శ
- జగన్ ను పులివెందుల ఎమ్మెల్యే అంటున్నారని అనితపై మండిపాటు
- అన్యాయంగా పనిచేస్తున్న పోలీసుల గురించే జగన్ మాట్లాడారని వ్యాఖ్య
- పలువురు ఐపీఎస్ లకు పోస్టింగ్ లు కూడా ఇవ్వలేదని విమర్శ



వివరాలు 2లో..

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త... గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు గ్రీన్ సిగ్నల్

- హైదరాబాద్, అమరావతి మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే
- తాజాగా రోడ్డు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఏపీ, తెలంగాణ మధ్య కనెక్టివిటీని పెంచేందుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం



పెన్ పవర్ డెస్క్: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలకు శుభావార్త చెప్పింది. ఏపీ, తెలంగాణ మధ్య కనెక్టివిటీని పెంచేందుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్, అమరావతి మధ్య దీన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా తాజాగా రోడ్డు

వివరాలు 2లో..



## ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు

పెన్ పవర్ డెస్క్:వైసీపీ కేడర్ వినాశనమే లక్ష్యంగా ఏపీ అధికారులు పనిచేస్తున్నారని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి మండిపడ్డారు. అక్రమ కేసులు పెట్టి వైసీపీ నేతలను అరెస్ట్ చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాక్షసానందం పొందుతోందని అన్నారు. అన్నీ గుర్తు పెట్టుకుంటామని, అందరినీ గుర్తు పెట్టుకుంటామని... అక్రమ కేసులు పెడుతూ, వేధింపులకు గురి చేస్తున్న ఎవరినీ ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషాను కడపలో అవినాశ్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినాశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంజాద్ బాషా సోదరుడు అహ్మద్ బాషాను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అంజాద్ బాషాను అవినాశ్ పరామర్శించారు. తీవ్రవాది మాదిరి

వివరాలు 2లో..

- మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషాను పరామర్శించిన అవినాశ్
- అంజాద్ బాషా సోదరుడు అహ్మద్ బాషాను అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపాటు
- కూటమి ప్రభుత్వం రాక్షసానందం పొందుతోందని మండిపాటు

## ఢిల్లీ ఏపీ భవన్ లోని పౌరసరఫరాల శాఖ దుకాణంలో మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీ



- బియ్యం నాణ్యతను పరిశీలించిన మంత్రి నాదెండ్ల
- బియ్యం బస్తా తూకంలో తేడా రావడంతో సిబ్బందిపై ఆగ్రహం
- ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న దుకాణం సీజ్
- ఇకపై ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే దుకాణం నడుస్తుందని ప్రకటన

వివరాలు 2లో..

## టీడీపీ పగ్గాలు లోకేశ్ కి అప్పగించాలి

- మరోసారి వర్మ వ్యాఖ్యల కలకలం
- కాకినాడ జిల్లా టీడీపీ ఆఫీసులో ప్రజాదర్బార్
- లోకేశ్ యువగళం పాదయాత్ర పార్టీ విజయానికి దోహదం చేసిందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలని ఇటీవల వ్యాఖ్యానించి కలకలం రేపిన వర్మ... తాజాగా లోకేశ్ కు టీడీపీ పగ్గాలు అప్పగించాలని అన్నారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడుతూ... పార్టీకి లోకేశ్ నాయకత్వం ఎంతో అవసరమని, లోకేశ్ తెలుగుదేశం పార్టీ

వివరాలు 2లో..



## పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు... కేంద్రంపై కేటీఆర్ ఆగ్రహం


- ఇంధన ధరల పెంపు ప్రజల జీవితాన్ని అతలాకుతలం చేసిందని విమర్శ
- పాక్ సహా వివిధ దేశాల కంటే పెట్రోల్ ధరలు మన దేశంలోనే ఎక్కువగా ఉన్నాయన్న కేటీఆర్
- అధిక ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవనాన్ని

వివరాలు 2లో..



## ఐఏఎస్ అధికారి రొనాల్డ్ రాస్‌కు క్యాట్‌లో ఊరట.. తెలంగాణకే కేటాయింపు




- విభజన సమయంలో ఏపీకి కేటాయించిన డీవోపీటీ
- క్యాట్‌ను ఆశ్రయించి పదేళ్లు తెలంగాణలో విధులు నిర్వర్తించిన రొనాల్డ్ రాస్
- మరోసారి క్యాట్‌ను ఆశ్రయించడంతో రొనాల్డ్ రాస్‌కు అనుకూలంగా తీర్పు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పవర్ కోసం ప్రతిపక్షాల పాకులాట

మూడేళ్లలో మేము పవర్ లోకి వస్తున్నాం . మీ సంగతి చూస్తాం.ఇంకా నాలుగేళ్ల టైముంది. కళ్ళు మూసుకుంటే నాలుగు రోజులుగా అయిపోతాయి. మళ్లీ మనమే పవర్ లోకి వస్తాం .రాగానే వాళ్ల తోలు తీస్తాను. ఆ ఎస్ ఐ పేరు గుర్తుపెట్టుకోండి . మూడేళ్ల తర్వాత పవర్ లోకి రాగానే వాడిచేత మీకు సెల్యూట్ కొట్టిస్తా. తెలుగు రాష్ట్రాల్లో ఈమధ్య బాగా వినబడుతున్న మాటలు ఇవి. ఏపీలో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి, తెలంగాణలో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిరోజు మూడేళ్లలో పవర్ లోకి వచ్చేస్తాం రాగానే వాడి సంగతి చూస్తాం. వీడి సంగతి చూస్తాం . అది కట్టిస్తాం . ఇది పడగొడతాం అని హామీల మీద హామీలు ఇస్తున్నారు.లో ఉన్న ఈ పొలిటికల్ పార్టీల ధైర్యం ఏమిటో మాత్రం ఎవరికి అర్థం కావటం లేదు. క్యాడర్ లో ఊపు తేవడానికి , నమ్మకం కలిగించడానికి ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారా .? లేక అధికార పక్షాన్ని బెదిరించి మైండ్ గేమ్ ఆడుతున్నారా అన్నది జనంలో చర్చ నడుస్తోంది. ప్రభుత్వం చేస్తున్నది తప్పు అని అనిపిస్తే ఆ తప్పుని అడ్డుకోవడంపై విపక్షాలు దృష్టిపెట్టడం లేదు. మేము వచ్చాక అలా చేస్తాం, ఇలా చేస్తాం అని బెదిరించడం చాలా మామూలు అయిపోయింది. అంటే మూడేళ్ల తర్వాత వీళ్ళు వస్తే మళ్లీ పగ ప్రతీకారాలు కొనసాగుతాయన్నమాట.ఇప్పుడు వాళ్ళని వీళ్ళు వేసుకుంటారు. మూడేళ్ల తర్వాత వీళ్లు వాళ్ళని వెంటాడుతారు అన్నమాట. అధికారంలోకి వస్తే ఏం చేస్తాము అన్నది పొలిటికల్ పార్టీలేవి చెప్పడం లేదు. రెండు మూడేళ్లలో మేము అధికారంలోకి వచ్చేస్తున్నాం . మేము ఆ బుక్ లో రాస్తున్నాం ఈ బుక్ లో రాస్తున్నాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. తెలుగు రాష్ట్రాల్లో అన్ని పార్టీలు ఒక రౌడీ గ్యాంగ్ లాగా తయారయ్యాయి. అసలు వీళ్ళ కాన్ఫిడెన్స్ ఏంటో అర్థం కాదు. ముఖ్యంగా ఏపీలో జగన్మోహన్ రెడ్డి కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఆరో నెలలోనే మొదలుపెట్టేశారు. నెక్స్ట్ మనమే అధికారంలోకి వస్తాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. ప్రభుత్వానికి నాలుగున్నర సంవత్సరాలు సమయం ఉంది.164 సీట్లు ప్రభుత్వానికి ఉన్నాయి. నాలుగేళ్ల తర్వాత ఏం జరుగుతుందో ఎవడికి ఏం తెలియదు. అసలు ప్రభుత్వం ఏర్పడి ఇంకా 9 నెలలు మాత్రమే అయింది. కానీ జగన్మోహన్ రెడ్డి అప్పుడే తొందరపడి పోతున్నాడు. నాలుగేళ్లలో మనమే అధికారంలోకి రాబోతున్నాం రాగానే . వాడి సంగతి తెలుస్తాను. వీడి సంగతి తెలుస్తాను అని హెచ్చరిస్తూ ఉంటారు. ముఖ్యంగా పోలీసు అధికారుల్ని%ా%. జగన్ పేరు పెట్టి మరి ఓ వీధి రౌడీలాగా వార్నింగ్ ఇస్తూ ఉంటారు.సరే కార్యకర్తలకు కాన్ఫిడెన్స్ నింపడానికి . మనం అధికారంలోకి రాబో తున్నాం ధైర్యంగా ఉండండి అని చెప్పొచ్చు. ప్రభుత్వాలు నిన్న గాక మొన్న ఏర్పడ్డాయి. ఆంధ్రాలో గట్టిగా 9 నెలలు అవ్వలేదు.అప్పుడే జగన్ 2029 లో నేనే అధికారంలోకి వస్తానని పాట పాడుతున్నాడు. ఆయనకు అంత తొందర ఎందుకో అర్థం కాదు. అధికారం లేకుండా ఉండలేకపోతున్నాడా? లేక నిత్యం భ్రమల్లో%ా%. ఊహల్లో బతుకుతున్నాడఇక తెలంగాణ విషయానికొస్తే బి ఆర్ ఎస్ అంచనాలకు మించి ఓవర్ కాన్ఫిడెన్స్ తో ఉంది. రేవంత్ సర్కార్ వైఫల్యాలు బి ఆర్ఎస్ లో విశ్వాసాన్ని నింపేసేయ్. ఎన్నికలకు ఇంకా మూడున్నర సంవత్సరాలు సమయం ఉంది. అయినా సరే టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆగలేకపోతున్నారు. అసలు రేపు ఎల్లుండో ఎన్నికలు జరిగిపోతున్నట్టతాము తిరిగి అధికార పీఠాల్లోకి ఎక్కి కూర్చున్నట్లు వీరావేశంతో హామీలు ఇస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పక్కనే ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ స్థలం విషయంలో

ఒక పక్క ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం వివరణ ఇస్తుండగానే . మరోవైపు కేటీఆర్ కాంగ్రెస్ ఏం మాయ చేసినా సరే అక్కడ స్థలాలు ఎవరూ కొనవద్దు. మరో మూడు ఏళ్లలో మన ప్రభుత్వం వస్తుంది ఆ స్థలాన్ని మేము వెనక్కి లాక్కుంటాం అని హెచ్చరిస్తారు. ఆ 400 ఎకరాలు మన ప్రభుత్వం ఎకో పార్క్ కట్టిస్తుంది హామీ ఇచ్చేస్తారు.ఆంధ్ర, తెలంగాణలో ప్రతిపక్షాల ధైర్యం ఏంటో అర్థం కాదు. గతంలో ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాము. ముఖ్యమంత్రిగా పని చేసాము. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాము. మర్యాదగా మాట్లాడాలి. అన్న ధ్యాస ఏ కొసానా లేదు. మూడేళ్లలో మేం అధికారంలోకి వస్తున్నాము. నాలుగేళ్లలో పవర్ లోకి వస్తాము. వాడి తోలు తీస్తాము. వీడు తోలు తీస్తాము. ఆ బుక్ లో రాస్తున్నాము ఈ బుక్ లో ఎక్కిస్తున్నాము . ఇలా ఒక రౌడీ గ్యాంగులు తరహాలో హెచ్చరికలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతీకార రాజకీయాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది.దీనికి ప్రధాన కారణం ఏ ప్రభుత్వమైనా ఐదేళ్లకు మించి ఉన్నదని అందరి నమ్మకం. వేలకోట్ల రూపాయలు అప్పులు తెచ్చి సంక్షేమ పథకాల అమలు చేస్తూ . ప్రజలను సంతృప్తి పరచలేక కచ్చితంగా ప్రభుత్వంలో ఉన్న ఏ పార్టీ అయినా ఐదేళ్లకు ఓడిపోక తప్పదు . కనుక జనం ప్రచారం న్యాయంగా మళ్ళీ మనకే ఓటేస్తారు . అందుకే అధికారం మనకు వచ్చేస్తుంది అనే ధీమాతో . ఓడిపోయిన మరుసటి రోజు నుంచే సిగ్గు ఎగ్గు లేకుండా మళ్లీ మనదే అధికారం అని చెప్పు తిరుగుతుంటాయి పార్టీలు. అసలు ప్రజలు మనల్ని ఎందుకు ఓడించారు . వేరే వాళ్ళకి ఎందుకు అధికారమిచ్చారు అన్న సమీక్ష చేయకుండా ప్రభుత్వాలకి ఏడాది నిండకుండానే వీళ్లు వచ్చే ఎన్నికల్లో మాదే అధికారంలో ప్రకటనలు చేస్తున్నారు.

# సీఎం చంద్రబాబు ఇంటి నిర్మాణానికి భూమిపూజ..

- మొదటి పేజీ తరువాయి

వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ కీలకమైన ప్రాజెక్టును ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. సచివాలయం వెనుక E9 రహదారి పక్కన 1,455 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ జి ప్లస్ 1 భవనం డిజైన్, నిర్మాణ పనులను ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పర్యవేక్షించ నుంది. ఏడాదిలోపు ఈ నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఈ నిర్మాణ ప్రక్రియను పర్యవేక్షిస్తారని సమాచారం. ఇప్పటికే హైదరాబాద్, నారావారిపల్లెలో నివాసాలు కలిగి ఉన్న చంద్రబాబు, ఇప్పుడు రాష్ట్ర రాజధాని అమరావతిలో సొంతిల్లు నిర్మించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉండగా, కుప్పంలో కూడా ఆయన మరో నివాసాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ గతంలో చేపట్టిన పెద్ద ప్రాజెక్టుల అనుభవం దృష్ట్యా, చంద్రబాబు తన కొత్త ఇంటి నిర్మాణ బాధ్యతలను వారికి అప్పగించినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ నిర్మాణానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి.

# నవనీత కృష్ణాలంకారంలో రామయ్య ముగ్ధమనోహర రూపం







- మొదటి పేజీ తరువాయి

కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.పురాణాల ప్రకారం.. కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ నటేష్ బాబు, సూపరిం టెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







# జే బ్రాండ్లతో లివర్, కిడ్నీ సమస్యలతో వేల మంది ప్రాణాలు కోల్పోయారు

**పెన్ పవర్ డెస్క్:**ఎక్సైజ్ వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన జగన్... లిక్కర్ వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారని చెప్పారు. కొత్త ఎక్సైజ్ పాలసీ పేరుతో వ్యవస్థను విచ్ఛిన్నం చేశారని దుయ్యబట్టారు. తిరుపతిలో పద్మావతి యూనివర్సిటీలో నిర్వహించిన ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిస్టిలరీల దగ్గర నుంచి మద్యం షాపుల వరకు మొత్తం హస్తగతం చేసుకున్నారని రవీంద్ర మండిపడ్డారు. జే బ్రాండ్ మద్యంతో లివర్, కిడ్నీ సమస్యలతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీకి శ్రీకారం చుట్టిందని చెప్పారు. డ్రా నిర్వహించి అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాలను కేటాయించామని తెలిపారు. గంజాయి నిర్మూలనకు ఈగిల్ టీమ్ లను ఏర్పాటు చేశామని చెప్పారు.

# మహిళల బట్టలు కూడా ఊడదీస్తామనే విధంగా జగన్ మాటలు ఉన్నాయి

- మొదటి పేజీ తరువాయి

పోలీసు అధికారిణి భవాని జగన్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "పోలీసులందరి బట్టలు ఊడదిస్తానని మాజీ ముఖ్యమంత్రి జగన్ అన్న మాటలు... మహిళా పోలీసుల బట్టలు కూడా ఊడదీస్తామనే విధంగా ఉన్నాయి. మహిళల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయి. పోలీసుల్లో మహిళలు కూడా ఉన్నారనే విషయం జగన్ కు తెలియదా? ముఖ్యమంత్రిగా పని చేసిన మీరే ఇలా మాట్లాడితే... పబ్లిక్ లో అందరూ ఏమనుకుంటారనే దాన్ని మీరే ఆలోచించాలి. తన వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకోవాలని పోలీసు అధికారుల సంఘం తరపున డిమాండ్ చేస్తున్నా" అని చెప్పారు.

# పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు... కేంద్రంపై కేటీఆర్ ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

దుర్భరం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ వంటి దేశాలతో పోలిస్తే మన దేశంలోనే పెట్రోల్ ధరలు అధికంగా ఉండటం శోచనీయమని అన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి కేటీఆర్ లేఖ రాశారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలను తగ్గించకపోవడం విమర్శలకు తావిస్తోందని అన్నారు. కేంద్రం విధిస్తోన్న సెస్సుల కారణంగా రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మినిమం గవర్నమెంట్, మ్యాగ్జిమమ్ గవర్నెన్స్' అనేది కేవలం నినాదంగా మిగిలిపోయిందని, 'మ్యాగ్జిమమ్ ట్యాక్సేషన్, మినిమమ్ రిలీఫ్' అన్న చందంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన ఎద్దేవా చేశారు.పెట్రోల్ ధరలను సెస్సుల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం ప్రజలను ఆర్థికంగా దోపిడీ చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

పన్నుల రూపంలో రాష్ట్రాలకు రావాల్సిన న్యాయమైన వాటాను ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. దేశ ఆర్థికాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం గణనీయంగా సహకరిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అరకొర నిధులతో నెట్టుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. అధిక ఆదాయం సమకూరుస్తున్న రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోందని ఆరోపించారు.

# జగన్ ను లేకుండా చేయాలనే కుట్ర జరుగుతోంది

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను లేకుండా చేయాలని చూస్తున్నారంటూ ఆ పార్టీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. జగన్ పర్యటనల్లో భద్రతా వైఫల్యాలు కనిపిస్తున్నాయని అన్నారు. జడ్ ప్లస్ రక్షణలో ఉన్న జగన్ కు కనీస భద్రత కూడా కల్పించడం లేదని విమర్శించారు. జగన్ ను లేకుండా చేయాలనే లక్ష్యంతో కుట్రపూరితంగా ఇలా చేస్తున్నారని అన్నారు. జగన్ ఇంటి దగ్గర కూడా సరైన భద్రతను కల్పించడం లేదని మండిపడ్డారు. ఒక మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతపక్ష నేతగా, ఒక పార్టీ అధ్యక్షుడిగా జగన్ ను చూడటం లేదని విమర్శించారు. జగన్ పర్యటనల గురించి ముందస్తు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. మండలానికి ఒకరిని చంపితే కానీ భయం రాదనే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. అన్యాయంగా వ్యవహరిస్తున్న పోలీసుల గురించి మాత్రమే జగన్ మాట్లాడారని... నిజాయతీగా పనిచేసే పోలీసులకు తాము సెల్యూట్ చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ముగ్గురు డీజీ స్థాయి అధికారులకు పోస్టింగ్ లు ఇవ్వకుండా వేధిస్తున్నారని అన్నారు. పలువురు ఐపీఎస్ లకు పోస్టింగ్ లు

ఇవ్వలేదని... దాదాపు 200 మంది పోలీసు అధికారులను వీఆర్ లో పెట్టారని మండిపడ్డారు. దీనిపై పోలీసు సంఘాల నేతలు మాట్లాడాలని అన్నారు. 11 వందల మంది పోలీసులతో జగన్ పర్యటనకు భద్రత ఏర్పాటు చేశామని హోం మంత్రి అనిత చెప్పడం కరెక్ట్ కాదని చెప్పారు. మాట్లాడితే పులివెందుల ఎమ్మెల్యే అని అనిత అంటున్నారని... ఆయన ఒక మాజీ ముఖ్యమంత్రి అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. డ్రామాలు చేయాల్సిన అవసరం తమకు లేదని... జగన్ వచ్చిన హెలికాప్టర్ ను జనాలు ఎలా చుట్టుముట్టారో చూడాలని చెప్పారు.

## ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు

- మొదటి పేజీ తరువాయి

అహ్మద్ బాషాను ముంబైకి వెళ్లి తీసుకొచ్చారని మండిపడ్డారు. అహ్మద్ బాషాను అరెస్ట్ చేసిన తర్వాత టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం దారుణమని అన్నారు. తప్పుడు కేసు పెట్టి అహ్మద్ ను అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కడపలో టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

## టీడీపీ పగ్గాలు లోకేశ్ కి అప్పగించాలి

- మొదటి పేజీ తరువాయి

రథసారథిగా నియమించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. లోకేశ్ యువగళం పాదయాత్రతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారని, అది పార్టీ విజయానికి దోహదం చేసిందని వర్మ అన్నారు. అంతేకాకుండా పార్టీ భవిష్యత్తు కోసం 2047 ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. లోకేశ్ నాయకత్వానికి కార్యకర్తలు సంపూర్ణ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

మంత్రి నారా లోకేశ్ చాలాకాలంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా, పల్లా శ్రీనివాసరావు ఏపీ టీడీపీ చీఫ్ గా ఉన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త... గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజీ తరువాయి

నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డీపీఆర్‌లు సిద్ధం చేసి పనులు ప్రారంభించనుంది. అటు, త్వరలోనే అమరావతి రింగ్ రోడ్డు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ ఆర్ఆర్‌కు ఉత్తరభాగం నుంచి హైవే నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

## ఢిల్లీ ఏపీ భవన్ లోని పౌరసరఫరాల శాఖ దుకాణంలో మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీ

**పెన్ పవర్ డెస్క్:**ఢిల్లీలోని ఏపీ భవన్ లో ఉన్న పౌరసరఫరాల శాఖ దుకాణాన్ని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ అందుబాటులో ఉంచిన బియ్యం నాణ్యతను పరిశీలించారు. బియ్యం బస్తా తూకంలో తేడా రావడంతో సిబ్బందిపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖ పేరుతో ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న ఆ దుకాణాన్ని సీజ్ చేశారు. ఏపీ భవన్ లో నెల రోజుల్లో ప్రభుత్వ దుకాణం ఏర్పాటు చేస్తామని మంత్రి అక్కడిక్కడే ప్రకటించారు. ఇకపై ఏపీ భవన్ లోని దుకాణం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలోనే నడుస్తుందని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మంత్రి నాదెండ్లతో పాటు పౌరసరఫరాల శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ కూడా పాల్గొన్నారు.

## ఐఏఎస్ అధికారి రొనాల్డ్ రాస్‌కు క్యాట్‌లో ఊరట.. తెలంగాణకే కేటాయింపు

**పెన్ పవర్ డెస్క్:**సీనియర్ ఐఏఎస్ అధికారి రొనాల్డ్ రాస్‌కు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించింది. ఆయన తెలంగాణ రాష్ట్రంలోనే కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. విభజన సమయంలో రొనాల్డ్ రాస్‌ను డీవోపీటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించింది. క్యాట్‌ను ఆశ్రయించి దాదాపు పదేళ్ల పాటు తెలంగాణలోనే విధులు నిర్వర్తించారు. అయితే, గత ఏడాది డీవోపీటీ తిరిగి కొంతమంది ఐఏఎస్‌లను ఏపీకి కేటాయించింది. డీవోపీటీ ఆదేశాల మేరకు రొనాల్డ్ రాస్ గత ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేశారు.అయితే, తనను తెలంగాణలోనే కొనసాగించాలంటూ ఆయన మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్ తెలంగాణలో కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేసింది.క్యాట్‌లో ఏఐఎస్ అధికారి శివశంకర్ కంటెంప్ట్ పిటిషన్

క్యాట్ ఆదేశాలను డీవోపీటీ అమలు చేయడం లేదంటూ ఐఏఎస్ అధికారి శివశంకర్ క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. శివశంకర్‌ను ఏపీకి కేటాయించాలని, నాలుగు వారాల్లో ఉత్తర్వులు జారీ చేయాలని డీవోపీటీని క్యాట్ ఆదేశించింది. డీవోపీటీ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఆయన మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. డీవోపీటీ గడువు కోరడంతో నాలుగు వారాల్లో ఉత్తర్వులు ఇవ్వాలని మరోసారి క్యాట్ ఆదేశించింది.

## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్...



**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్09 :** ముఖ్యమంత్రి వినూత్న ఆలోచన మేరకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుతో ఐదు SPOC (సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్) హబ్‌ల ఏర్పాటుతో, తద్వారా కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు ముందుకు వచ్చే విద్యార్థులకు అన్ని విధాలా సపోర్ట్ అందించి నూతన ఆవిష్కరణలకు దోహద పడేలా ఈ కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందని, ఆదానీ, అమర్ రాజ, నవయుగ పరిశ్రమల సహకారంతో ఐఐటి తిరుపతి సరికొత్త టెక్నాలజీ ఆవిష్కరణల ఇన్నోవేషన్ ల కొరకు సారి కొత్త ఐడియా లతో వచ్చే విద్యార్థులకు వారికి సాఫ్ట్వేర్, హార్డ్ వేర్ అన్ని విధాల సపోర్ట్ అందించి దక్షిణ ఆంధ్ర కవర్ చేసేలా ఐఐటీ, తిరుపతి స్పోక్ హబ్‌గా ఉండనున్నదని, దానికి సంబంధించిన పలు అంశాలపై నేడు బుధవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ గారిని ఐఐటి డైరెక్టర్ ప్రొ.సత్యనారాయణ కలిసి చర్చించారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి





**అనంతపురం, పవర్ ఏప్రిల్ 09 :** తామిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 12వ డివిజన్ లో ఎమ్మెల్యే మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జనబలం బాబా, నగర పాలక సంస్థ కమిషనర్ బాలాస్వామి, ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యల్లో కొన్నింటికి అక్కడక్కడే పరిష్కారం చూపించారు. మరికొన్నింటిని నిర్దిష్ట కాల వ్యవధిలో పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య కనిపిస్తోందని..దీనికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారానే తగిన పరిష్కారం చూపించబోతున్నట్లు తెలిపారు. ఇందుకోసం 750 కోట్లతో ప్రణాళిక చేసినట్లు వివరించారు. మరోవైపు డంపింగ్ యార్డ్ సమస్య కూడా ఎక్కువగా ఉందని..దీనిని అక్టోబర్ రెండు లోపల పూర్తిస్థాయిలో చెత్తను అక్కడి నుంచి తరలిస్తామన్నారు. నగరానికి సమీపంలో మరోచోట డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసేందుకు.. స్థల సేకరణ కూడా జరిగిందని వివరించారు. వర్షాల సమయంలో నడిమి వంక, మరువవంక ప్రాంతాల్లోని కాలనీలు నీట మునుగుతున్నాయని... అందుకే వీటి కోసం ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం కూడా జరుగుతోందని చెప్పారు. ఇందుకోసం 88 కోట్ల రూపాయలతో అంచనాలు కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలో నగరంలో పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలు నిర్మించబోతున్నామని.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. గత ఐదేళ్ల పాలనలో అనంతపురం నగరాన్ని సమస్యలకు నిలయంగా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 9 :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ముఖ్యంగా పట్టణంలో 15న జాబ్ మేళా నిర్వహించినట్లు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఓ ప్రకటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, రావు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా కరపత్రాలను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా జాబ్ మేళాకు బయట ప్రాంతాల ప్రతినిధులు ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొంటారని తెలియజేశారు.

## ఆరోగ్య కేంద్రం నూతన భవనం ప్రారంభోత్సవం



**అనంతపురం పెన్ పవర్ ఏప్రిల్ 9 :** బెలుగుప్ప మండల కేంద్రంలోని గుండ్లపల్లి రోడ్డులో బుధవారం నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి ప్రారంభించిన గౌరవ రాష్ట్ర ఆర్థిక&ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్&బి ఎస్ఈ రాజగోపాల్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆర్&బి డిఈ బాల కాటమయ్య, మెడికల్ అధికారులు డా.కార్తీక్ కుమార్ రెడ్డి,

# నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

## రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 9 :** ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో స్మశానవాటికని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు చేపట్టాలని ధర్మవరం డివిజన్ నందు అర్హులందరికీ ఇంటి గృహ నిర్మాణాలకు అందజేయడానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం నియోజకవర్గ నందు పలు చెరువులు అభివృద్ధి చేయడానికి ఎంత నిధులు అవసరమో నివేదికల సిద్ధం చేయాలన్నారు. బుధవారం ధర్మవరం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నుండి మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపరిచే దిశగా ప్రతి శాఖ కూడా సక్రమంగావ్యవహరించాలని సూచించారు ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమన్వయంతో పనిచేస్తే అన్ని కార్యక్రమాలూ విజయవంతంగా అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముదిగుబ్బ మండలంలోని యోగి వేమన రిజర్వాయర్ ప్రాజెక్టును సుమారు 60 లక్షల రూపాయలతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 85 చెరువులలో అభివృద్ధి చేయడానికి 96 పనులు ఆమోదించి ప్రభుత్వానికి 179.9 లక్షల రూపాయలు నిధులు అవసరమని నివేదికలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో త్రిబుల్ ఆర్ ద్వారా 21 చెరువుల అభివృద్ధి చేయడానికి 795 లక్షల రూపాయలు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి నివేదికల సమర్పించడం జరిగిందని తెలిపారు. హెచ్ ఎన్ ఎస్ ఎస్ కాలువ ద్వారా, పీఏబీఆర్ ద్వారా కాలువల ద్వారా 14 చెరువులు నీరు అందజేయుచున్నామని తెలిపారు. నియోజకవర్గంలో తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం అర్బన్ నందు తీవ్ర నీటి ఎద్దడి నివారణ కొరకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, రక్షిత నీటి పథకాలు సమగ్రంగా సమీక్షించారు. ధర్మవరం మున్సిపాలిటీ నందు ఉన్న స్మశాన వాటికి అభివృద్ధి చేయడానికి హైదరాబాదులో ఉన్న మహాప్రస్థానం లాగా తీర్చిదిద్దడానికి అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.



నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలనేది ప్రభుత్వం యొక్క ఎజెండా అన్నారు.రాబోయే 5 సంవత్సరాల కాలంలో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలని ఈ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇది వరకే లబ్ధి పొందిన వారి పునాదులకు ఇంటి నిర్మాణం జరిగిన వారందరిని ఇంటిని నిర్మించడానికి సంబంధ శాఖ అధికారులతో కృషి చేయాలని తెలిపారు నియోజకవర్గంలో సుమారు 15830 ఇల్లు నిర్మాణాలు నిర్మించడానికి ఆమోదం తెలిపి ఉన్నామని, నియోజకవర్గంలో అర్బన్ ప్రాంతాలలో 13 వేల ఇల్లు నిర్మాణాలు పనులుదశలవారుగా జరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షులు సంధి రెడ్డి శ్రీనివాస్, మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, ఎంపీపీ ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఆర్డీవో మహేష్, మైనర్ ఇరిగేషన్ అధికారి విశ్వనాథరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ అధికారి మల్లికార్జునప్ప, హౌసింగ్ అధికారి శంకరయ్య, ఎస్ సి పి ఆర్ మురళీమోహన్ నేషనల్ హైవేస్, హార్టికల్చర్ అధికారులు, ఆర్ అండ్ బి నేషనల్ హైవే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు కలిగినటువంటి వారు అన్ని రంగాల్లో రాణించాలి

పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ







**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 09 :** అనంతపురం నగరంలోని కస్తూర్బా మున్సిపల్ హైస్కూల్ లో బుధవారం విద్య శాఖ మరియు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.లిఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగినటువంటి పిల్లలు ఏదో ఒక అవయవం లేక, భగవంతుడు చిన్నచూపు చూడడం వలన మాత్రమే వారు ప్రత్యేక అవసరాలు కలిగినటువంటి విద్యార్థులుగా గుర్తించబడ్డారన్నారు. కొన్ని ఉపకరణాలు ఉపయోగించి విద్య మరియు ఉద్యోగాల్లోనూ అన్ని రంగాల్లో రాణించడానికి ఈ ఉపకరణాలు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు. ప్రత్యేక అవసరాలు తీర్చడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దాదాపుగా జిల్లాలో 224 మంది విద్యార్థులకు దాదాపుగా 22 లక్షల ఖర్చు చేసి ఈరోజు సమగ్ర శిక్ష ద్వారా బ్రెయిన్ లిపి కిడ్స్, సిపి చైర్స్, టీ.ఎల్ ఎం కిడ్స్, ఇయర్ బర్డ్స్ మొదలైన ఆధునిక ఉపకరణాలని అందచేయడం ఎంతో సంతోషమన్నారు. మన ప్రభుత్వం అందించిన ఈ ఉపకరణాలని చక్కగా వాడుకొని తమకున్న చిన్నపాటి లోపాలను సరి చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ విద్యార్థులను తల్లిదండ్రులు మరియు భవిత కేంద్రం ద్వారా టీచర్స్ మరియు సహాయకులు సేవ చేస్తున్నారని తెలియజేశారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులు కూడా ప్రభుత్వం పెన్షన్ అందజేస్తుందన్నారు. విద్యార్థులు శ్రీ అమృత రాయదుర్గం - బ్రెయిలీ లిపి కిడ్స్, శ్రీవాణి, అనంతపురం సిపి చైర్, శ్రీముసుందరి - టిఎల్ఎం కిడ్స్ మొదలైనవి అందజేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను ఉపయోగించుకోవాలన్నారు. తమకున్న చిన్నపాటి లోపాలను సరి చేసుకొని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ ఉపకరణాలు అందించడం చాలా సంతోషంగా ఉందని, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తరువాయి 5లో..

## నవనీత కృష్ణాలంకారంలో రామయ్య ముగ్ధమనోహర రూపం





ఒంటిమిట్ట పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 9 : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం నవనీత కృష్ణాలంకారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం.. కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ నటేష్ బాబు, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





# సామాన్యులకు భారమైన పెరిగిన గ్యాస్ ధరలు



**పలమనేరు పెన్ పవర్ ఏప్రిల్ 09 :** సామాన్యులకు ప్రస్తుతం పెరిగిన గ్యాస్ ధరలు భారమైనదని పట్టణ సీపీఎం నాయకులు అన్నారు. బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద పెరిగిన గ్యాస్ ధరలపై నిరసన తెలిపారు.ఈసందర్భంగా పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా మాట్లాడుతూ.. గ్యాస్ ధర 50 రూపాయలు పెంచినందుకు తీవ్రంగా ఖండిస్తున్నామని,ఇలా కేంద్ర ప్రభుత్వము ధరలను పెంచుకుంటూ పోతుంటే సామాన్యులు ఎలా బతకాలని అన్నారు. గృహావసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.50 మేర పెంచింది.ఈ పెరిగిన ధరలు మంగళవారం నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సామాన్య వినియోగదారులపై, రాష్ట్ర ప్రభుత్వంపై కలిపి ప్రతినెలా భారీ ఆర్థిక భారాన్ని మోప నుంది,ఆంధ్ర రాష్ట్రం లో గ్యాస్ వినియోగం గణనీయంగా ఉంది. అంచనాల ప్రకారం.. రాష్ట్రంలోని వినియోగదారులు ప్రతి నెలా దాదాపు కోటి వరకు వంటగ్యాస్ సిలిండర్లను కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరల పెరుగుదల వలన నేరుగా నెలకు అదనంగా రూ.50 కోట్ల భారాన్ని మోపనుంది. ఇది ఇప్పటికే అధిక ధరలతో సతమత మవుతున్న సామాన్య ప్రజలకు మరింత భారంగా మారనుంది. మరోవైపు..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉజ్వల పథకం ఈ ధరల పెరుగుదల కారణంగా అదనపు ఆర్థిక భారాన్ని ఎదుర్కోనుంది.ఈ పథకం కింద రాష్ట్రంలో దాదాపు 32.90 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం కేవలం రూ. 500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తోంది.కేంద్రం ధరలు పెంచినప్పటికీ.. ఈ లబ్ధిదారులకు అదే ధరకు సిలిండర్‌ను సరఫరా చేస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చింది.దీని ప్రకారం, పెరిగిన ఒక్కో సిలిండర్‌పై రూ.50 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం రాయితీ రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనుంది.ఈ చర్యతో ఉజ్వల పథకం లబ్ధిదారులపై ప్రస్తుత ధరల పెరుగుదల ప్రభావం ఉండదు. అయితే..దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా అదనంగా రూ.21.45 కోట్లను భరించాల్సి ఉంటుంది. ఇతర వినియోగదారుల పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఉజ్వల పథకం పరిధిలోకి రాని దాదాపు 33.82 లక్షల మంది విని యోగదారులు ఈ ధరల పెరుగుదల కారణంగా తీవ్రంగా నష్టపోనున్నారు. వీరికి ఎలాంటి రాయితీ లేనందున.. వారు కొను గోలు చేసే ప్రతి సిలిండర్‌పై అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.ఇది వారి నెలవారీ ఖర్చులపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని ఆయన అన్నారు.ఇందులో పట్టణ కమిటీ రాజా, జయంతి,శ్రీరామయ్య, సభ్యులు సుధాకర్, ప్రతాప్,ధనమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ రెడ్ క్రాస్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 09 :** జాతీయ స్థాయిలో పాల్గొని అవార్డులు సాధించిన రెడ్ క్రాస్ విద్యార్థులను మరియు రాష్ట్ర రెడ్ క్రాస్ బృందాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్ నందు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో కూడా మంచి ప్రతిభా కనపరిచి అవార్డులు తీసుకొచ్చి జిల్లా కు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆ బృందాన్ని అభినందించారు. మార్చి 24 నుండి 28 వరకు ఒడిస్సా రెడ్ క్రాస్ సొసైటీ భుబనేశ్వర్ నందు నిర్వహించిన "అంతర్రాష్ట్ర జూనియర్ రెడ్ క్రాస్ విద్య మరియు శిక్షణ క్యాంపు' నకు ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ 4 జిల్లాల నుండి 19 మంది జేఆర్సి విద్యార్థులు మరియు విజయం కాలేజ్ చౌదరి మరియు రాజమండ్రి విజయ కుమారి కాగా స్టేట్ కౌన్సిలర్ గా చిత్తూరు రెడ్ క్రాస్ నుండి చిరంజీవి తోపాటుగా అంతర్రాష్ట్ర క్యాంపులో 7 రాష్ట్రాల నుండి విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ అంతరాష్ట్ర క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచి "ఆంధ్ర ప్రదేశ్ జూనియర్ రెడ్ క్రాస్ బృందం" ఉత్తమ కౌన్సిలర్ మరియు ఉత్తమ రాష్ట్ర JRC బృందంకు ఒడిషా రెడ్ క్రాస్ జనరల్ సెక్రెటరీ విశ్రాంత IAS గణేష్ చంద్ర పాత్ర ద్వారా అవార్డులు అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ.మోహన్ కుమార్, రెడ్ క్రాస్ చైర్మన్ వి.రమేష్ బాబు, కోశాధికారి డా.ఎం.తేజోమూర్తి, MC సభ్యులు MR అరుణ కుమారి, జిల్లా కార్యదర్శి ఆర్.సహదేవ నాయుడు, పరిపాలన అధికారి గోపి, జిల్లా కోఆర్డినేటర్ చిరంజీవి, చౌదరి, జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సముద్రం లోకి తాబేలు పిల్లలు

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్**



**చిల్లకూరు, కోట పెన్ పవర్ ఏప్రిల్ 09 :** వన సముద్రం తాబేళ్ల పిల్లల సంరక్షణ కేంద్రం మరియు పర్యావరణ పర్యాటక కేంద్రం శగుమ్మళ్ళ దిబ్బ బీచ్ వద్ద గల సముద్రం లోకి తాబేళ్ల పిల్లలను వదిలిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మరియు డి.ఎఫ్.ఓ. వివేక్.

## చట్టసభల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలి



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 9 :** చట్ట సభల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని ముదిరాజ్ రాష్ట్ర మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్ రావు కోరారు.బుధవారం విజయవాడ నుంచి తిరుపతికి వెళుతున్న ఆయనను నాయుడుపేటలోని మల్లాం కూడలి వద్ద గోనుపల్లి గురుమూర్తి కార్యాలయంలో ముదిరాజ్ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు.ఆయనతో పాటు నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన ఆశా చెంచుకృష్ణయ్యను సైతం ముదిరాజ్ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 29లక్షలకు పైగా ముదిరాజ్‌లు ఉండగా కుల గణలలో తక్కువగా చేసి చూపిస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలలో అత్యధిక శాతం ఉన్న ముదిరాజ్‌లకు చట్ట సభల్లో గుర్తింపు తీసుకువచ్చేలా ఎమ్మెల్సీలతో పాటు ఇతర పదవులు కేటాయించాలన్నారు. ముఖ్యంగా ఆర్థిక,సామాజిక రంగాల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలన్నారు.ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి బీసీలలో అధిక శాతం ఉన్న ముదిరాజ్‌లకు ప్రాతినిత్యం కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆశా చెంచుకృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ముదిరాజ్‌లు అత్యధికంగా ఉన్నారని దీనిపై కూటమి నాయకులు స్పందించి ముదిరాజ్‌లకు రాజకీయ,ఆర్థిక, సామాజిక రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కోర్న వెంకట నారాయణ ముదిరాజ్,రాష్ట్ర నాయకులు భువనగిరి శేషగిరిరావు,పాము రవికుమార్ ముదిరాజ్,పెరుమాళ్ల వీరన్న ముదిరాజ్,మణిమేల రాజేష్ ముదిరాజ్,కనకట్ల మోహన్ ముదిరాజ్,గోనుపల్లి గురుమూర్తి, గునిశెట్టి గోపాల్ ముదిరాజ్,గరిక సుబ్రమణ్యం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ





**కడప పెన్ పవర్ ఏప్రిల్ 9 :** కడప నియోజకవర్గంలో లబ్ధిదారులకు రూ.15,89,745/-మరియు ,835192/-విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి . టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ, ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తుంది. గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధిని పక్కనపెట్టి ప్రజలను ఏ రకంగా పీడించిందో మనందరం చూసాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా బాధిత కుటుంబాలకు, నిరుపేద కుటుంబాలకు డబ్బులను అందజేసి వారికి ఆపదలో అండగా నిలుస్తున్నారు. అర్హులైన మధ్యతరగతి పేద కుటుంబాలు సీఎంఆర్ఎఫ్ కోసం అప్లై చేసుకోగలరని ఈ సందర్భంగా తెలియజేశారు.

## స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధికి తోడ్పాటు అయ్యేలా వారి రుణాలు సద్వినియోగం కావాలి



**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 09 :** అన్యూవల్ క్రెడిట్ అండ్ లైవ్ లీ హుడ్ యాక్షన్ ప్లాన్ ను పక్కా గా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయం లోని సమా వేశపు మందిరం లో డిఆర్డిఎ ద్వారా అమలు అవుతున్న పథకాల అమలు పై ఏపిఎం లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .... స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధి కి సంఘాల ద్వారా పొందే రుణాలను సద్విని యోగం చేసుకునేలా క్షేత్ర స్థాయిలో అధికారులు పని చేయాలని తెలిపారు.రుణాల ను పొందిన మహిళలు కుటుంబ అవస రాలకు రుణం వినియోగించుకోకుండా స్వయం ఉపాధి ని పెంపొందించు కొనేలా కృషి చేయాలన్నారు.. సంఘాల ద్వారా రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించేలా క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి రికవరీ పై దృష్టి పెట్టాలన్నారు.

స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది తిరిగి చెల్లించని వారి పై మరియు సంఘ సభ్యులకు సంబంధించిన నగదును బ్యాంకులలో డిపాజిట్ చేయకుండా ఇబ్బంది పెట్టే వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగు తుందని తెలిపారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబన కు మంజూరు చేస్తే రుణాలు సద్వినియోగం అయితే ఎంతో వారి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని,ఈ విషయంలో ఏపీఎంలు క్షేత్రస్థాయి లో అవగాహన పెంచి సద్వినియోగం అయ్యే లా చర్యలు చేపట్టాలన్నారు. అన్యూవల్ క్రెడిట్ అండ్ లైవ్ లీ హుడ్ యాక్షన్ ప్లాన్ ను క్షేత్రస్థాయిలో పరిస్థితు లను పూర్తిగా అవగాహన చేసుకుని అందుకు అను గుణంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని తెలిపారు. ఇందుకు సంబంధించి జరుగుతున్న ఎన్యుమరేషన్ సర్వే ను పారదర్శకంగా పకడ్బందీగా చేయాలని ఆదేశించారు.. ఎన్యుమరేషన్ సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షించాలని డిఆర్‌డిఏపిడిని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి శ్రీదేవి ఏపీఎం లు పాల్గొన్నారు.

## చీనీ మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 09 :** అనంతపురం మార్కెట్ యార్డులో చీనీ రైతులకు జరుగుతున్న మోసంపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని మార్కెట్ యార్డును అర్బన్ ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ గత కొన్ని రోజులుగా కేవలం ఐదు మంది వ్యాపారులు మాత్రమే ఆన్లైన్ పేరుతో రైతులను దగా చేస్తున్నారు. బయట మార్కెట్లలో టన్ను చీనీ 50 వేలు ఉండగా, ఇక్కడ 20 నుంచి 25 వేల మధ్య మాత్రమే వచ్చేలా చూస్తున్నారు. అందులో రైతుల మధ్య పోటీ పెడుతూ వారిని దగా చేస్తున్నారు. దీనిపై గత నెల రోజులుగా ఎమ్మెల్యే దగ్గుపాటి తన సిబ్బందితో నిఘా ఉంచారు. పండ్లతోట రైతు సంఘాలు, నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టికి ఈ విషయాన్ని తీసుకొచ్చారు. ఇవాళ ఆయన ఆకస్మికంగా మార్కెట్ యార్డ్ ని తనిఖీ చేసి.. అక్కడ మోసాలని బట్టబయలు చేశారు. అక్కడున్న మార్కెట్ యార్డ్ సెక్రటరీ పై ఎమ్మెల్యే దగ్గుపాటి నిప్పులు చెరిగారు. ఇక్కడ ఎంతమంది వ్యాపారులు పంట కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించగా.. 42 మంది దాకా ఉన్నారని చెప్పారు. దీంతో గత నెల రోజుల నుంచి జరిగిన వ్యాపారం రికార్డులన్నీ బయటకి తీశారు. కేవలం ఐదు మంది మాత్రమే ఇక్కడ పంట కొనుగోలు చేస్తున్నారని.. మిగిలిన వారు ఏమయ్యారని నిలదీశారు. మరోవైపు రైతుల నుంచి నిబంధనల ప్రకారం 4 శాతం కమీషన్ వసూలు చేయాల్సి ఉండగా 10 శాతం వరకు వసూలు చేస్తున్నారని రైతులు చెప్పారు. దీంతో ఆయన మార్కెట్ యాడ్ సెక్రటరీని నిలదీశారు. అయితే దీనిపై తనకు సమాచారం లేదని చెప్పగా ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డ్ లో మీరు ఏం చేస్తున్నారు అంటూ నిలదీశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పండ్ల తోటల రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం మైదానంలో రాష్ట్ర హాకీ పోటీలు ఘనవిజయం

**- విజేతలకు ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ అభినందనలు**



**ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 9 :** హాకీ పోటీ విజేతలకు ట్రోఫీలు, పథకాలు అందజేసిన ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్. పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల ఆరవ తేదీ నుంచి 9వ తేదీ వరకు రాష్ట్ర హాకీ పోటీలు నిర్వహించారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన ఈ హాకీ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా హాకీ క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చూపడం జరిగింది. చివరి రోజున సెమీఫైనల్, ఫైనల్ నిర్వహించారు. సెమీ ఫైనల్ లో తిరుపతి-కాకినాడ (0-1), అన్నమయ్య-కడప (4-5), కాకినాడ- కడప (2-0), అన్నమయ్య-తిరుపతి (3-1),(సూట్ అవుట్) సెమీఫైనల్ పోటీలు జరిగాయి. తదుపరి ఫైనల్ పోటీల్లో కాకినాడ -కడప (2-0), విన్నర్స్ గా కాకినాడ, సెకండ్ లో కడప జిల్లా, థర్డ్ లో అన్నమయ్య జిల్లా కైవాసం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొని, హాకీ క్రీడలో పాల్గొన్న వారందరికీ కూడా అభినందన శుభాకాంక్షలు తెలుపుతూ, గెలుపొందిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేసి పథకాలు మరియు ట్రోఫీలు అందించారు. ఈ హాకీ పోటీలను విజయవంతం చేసిన వారందరికీ కూడా వారు కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హాకీ టర్ఫ్ కోర్టును వీలైనంత త్వరలో ధర్మవరంలో ఏర్పాటు చేస్తారని వారు హామీ ఇచ్చారు. ధర్మారంలో ఏ క్రీడలైనా సరే రాష్ట్ర జాతీయ స్థాయికి వెళుతుండడం నిజంగా నిర్వాహకులు యొక్క కృషి శ్రమ అని తెలుపుతూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు చాణిక్య రాజు, కోశాధికారి తామస్ పీటర్, హాకీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాష్, సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షులు గౌరీ ప్రసాద్, ఉడుగుల రామచంద్ర, ఊకా రాఘవేంద్ర, మహమ్మద్ అస్లాం, ట్రెజరర్ అంజన్న, అరవింద గౌడ్, చందు, డైరెక్టర్లు మారుతీ ప్రసాద్, ఇర్షాద్, అమురుద్దీన్, కిరణ్, జిల్లా హాకీ కోచ్, జిల్లాల హాకీ అధ్యక్షులు,కార్యదర్శులు పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర్, రూరల్ అధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబ్లేష్, మైనార్టీ నాయకులు, డోలా రాజారెడ్డి, డి. చెర్లోపల్లి నారాయణస్వామి, పోతుకుంట రాజు, శ్యామ్ రావు, కంచం లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యం కలిగిన వారికి మెండుగా ఉపాధి అవకాశాలు

**ఖైదీలు శిక్ష అనంతరం ఆర్థికంగా ఎదగడానికి బ్యాంక్ ఋణాలు : జిల్లా కలెక్టర్**

**చిత్తూరు పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్, ఏప్రిల్ 09 :** వృత్తిరీత్యా నైపుణ్యం కలిగిన వారికి మాత్రమే ఉపాధి అవకాశాలు ఎక్కువ వస్తాయని, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం ద్వారా మెరుగైన వృత్తి నైపుణ్య శిక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా జైలులో ఖైదీలకు సంకల్ప- స్కిల్ ట్రైనింగ్ కింద మల్టీ స్కిల్ ట్రేడ్ కింద శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ ల ప్రధానం కార్యక్రమము నకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో నైపుణ్యం కలిగిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఏసి మెకానిక్ వంటి వృత్తుల వారు నైపుణ్యాన్ని పెంచుకుని ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఖైదీలు శిక్ష అనంతరం సత్ప్రవర్తనతో ఆర్థికంగా ఎదగడానికి సంకల్ప-స్కిల్ ట్రైనింగ్ కింద మల్టీ స్కిల్ ట్రేడ్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, భవిష్యత్తులో ఈ కార్యక్రమం ద్వారా మరింతమందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. డిఆర్డిఏ, స్కిల్ డెవలప్మెంట్ అధికారుల ద్వారా ఎస్ బి ఐ, యూనియన్ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంకుల ద్వారా ఋణ సౌకర్యం కల్పించడం జరుగుతుందని, తద్వారా వారు పొందిన నైపుణ్య శిక్షణ మేరకు ఉపాధి ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. జిల్లా జైల్ సుపెరింటెండెట్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఫిబ్రవరి 18 నుండి మార్చి 24 వరకు 34 మంది జైలు ఖైదీలకు డి ఆర్ డి ఏ, స్కిల్ డెవలప్మెంట్, న్యాక్ సమన్వయంతో మల్టీ స్కిల్ ట్రేడ్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఖైదీలందరికీ విజయవంతంగా శిక్షణా తరగతులు పూర్తి చేయడం జరిగిందని,ఈ కార్యక్రమం ద్వారా శిక్ష అనంతరం పౌర సమాజంలోకి అడుగుపెట్టిన అనంతరం ఎటువంటి తప్పులు చేయకుండా సత్ప్రవర్తన, సన్మార్గంలో నడవడానికి మార్గం చూపడం జరుగుతుందన్నారు. జిల్లాలో జైల్ లో మహిళా ఖైదీలు ఉన్నారని, వీరికి టైలరింగ్ వృత్తిలో శిక్షణ అందిస్తే భవిష్యత్తులో ఉపాధి కలుగుతుందని కలెక్టర్ ను కోరారు.ఖైదీల సంక్షేమం నిమిత్తం శిక్ష ముగిసిన అనంతరం జీవనోపాధుల కొరకు మెరుగైన నైపుణ్య శిక్షణ అందిస్తున్నారని, ఓపెన్ క్లాస్ ద్వారా 10వ తరగతి శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి డి ఆర్ డి ఏ పిడి శ్రీదేవి, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ అధికారి గుణశేఖర్, న్యాక్ ఏడి సతీష్,జైల్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్ ఘటనలో కార్యకర్త ఆయాకి మెమోలు జారీ సిడిపిఓ





**పెళ్లకూరు, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 9 :** పెళ్లకూరు మండల పరిధి లోని కానూరు అంగన్ వాడి కేంద్రంలో మంగళవారం పిల్లలకు వడ్డించిన ఆహారం తిని ఐదుగురు అస్వస్థతకు గురైన సంఘటన జరిగింది. దీనిపై నాయుడుపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉమా మహేశ్వరి బుధవారం ఆ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేపట్టారు. మంగళవారం పిల్లలకు వండి వడ్డించిన పులిహోర పదార్థాల తయారీని గురించి ఆరా తీశారు. వంట తయారీలో వాడిన నీళ్లు, బియ్యం, పులిహోర తయారీకి ఉపయోగించిన సామాగ్రిని పరిశీలించారు. పిల్లలు పాక్షికంగా అనారోగ్యానికి గురై, త్వరగా కోల్పోవడంతో అందరం ఊపిరి పీల్చుకున్నామన్నారు. ఇలాంటి పరిస్థితి మళ్లీ తలెత్తితే ఉద్యోగ భద్రత కోల్పోతారని తీవ్రంగా హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రం పాడుబడిన భవనంగా ఉండటంతో, ఇక్కడ పారిశుద్ధ్య పరిస్థితులు కూడా అనుకూలంగా లేవని, అద్దె భవనంలోకి మార్చాలని సూచించారు. అస్వస్థతకు గురైన ఐదుగురు పిల్లలు మంగళవారం ముగ్గురిని, బుధవారం ఇద్దరిని వారి ఆరోగ్యం కుదుటపడడంతో హాస్పటల్ నుండి డిశ్చార్జ్ అయినట్లు కూడా తెలియజేశారు. ప్రతి అంగన్ వాడి కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా పరిశుభ్రత గల వాతావరణం లో, పరిశుభ్రత పాటిస్తూ ఆహార పదార్థాలను కేంద్రం పనివేళలోని వండి వడ్డించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్, చెంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది హాజరయ్యారు.

## పిఎంఎజివై ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు..

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్ 08 :** ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామీణ యోజన క్రింద ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు 19 గ్రామాలు ఎంపిక చేశామని అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గ్రామ సర్పంచులు, ఎంపిడిఓలను సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామీణ యోజన పథకంపై గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, జిల్లా అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామీణ యోజన క్రింద ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికల రూపొందించాలని సంబంధిత అధికారులు, సర్పంచ్ లను ఆదేశించారు. ఈ కార్యక్రమం క్రింద ఎంపిక చేసిన 19 గ్రామాల్లో అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గతంలో సంసద్ ఆదర్శ్ గ్రామీణ యోజన క్రింద గ్రామాలను అభివృద్ధి చేసేందుకు సంబంధిత పార్లమెంటు సభ్యులు వారి పదవి కాలంలో ఒక్కొక్క గ్రామాన్ని తీసుకొని అభివృద్ధి చేసేవారన్నారు. ఇందుకు అనుబంధంగా ఈ పథకాన్ని ఇంకా ప్రధానంగా ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించి వారిని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. చాగలమర్రి మండలంలోని మద్దూరు, పెద్దబోదనం, పాణ్యం మండలంలోని చెందిన గోనవరం, కొండజూటూరు, జూపాడుబంగ్లా మండలంలోని పి.గణపురం, నంద్యాల మండలంలోని రాయమల్పురం, రుద్రవరం మండలంలోని పెద్దకంబులూరు, వెలుగోడు మండలంలోని అదుల్లపురం, గోస్పాడు మండలంలోని సంబవరం, పసురపాడు, బేతంచెర్ల మండలంలోని గొల్లగుట్ట, కోవెలకుంట్ల మండలంలోని సౌదరిదిన్నె, మహానంది మండలంలోని తమ్మడపల్లి, మసీదుపురం, పాములపాడు మండలంలోని వేంపెంట, మిడ్తూరు మండలంలోని అలగనూరు, చెరుకుచెర్ల, ఆత్మకూరు మండలంలోని వడ్లరామపురం, ఆళ్లగడ్డ మండలంలోని పాతకందూర్ గ్రామాలను ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామీణ యోజన క్రింద ఎంపిక చేసి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం గ్రామాల అభివృద్ధి కోసం 20 లక్షలు మంజూరు చేయడంతో పాటు అదనంగా అడ్మిన్ కాస్ట్ పరంగా లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అందుకు గ్రామ సర్పంచులు, ఎంపిడిఓలు గ్రామాలను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి ఎక్కువ శాతం సిసి రోడ్లు, బిటి రోడ్లకే ఎక్కువ శాతం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా చదివిన వారు ఎంతో మంది ఉన్నాయని వారిలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడానికి స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయవచ్చన్నారు. సోలార్ ఫలకల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నుండి నీరు తీసుకోవచ్చు అని, గ్రామాల్లో చాలా వరకు స్మశాన వాటికలో అభివృద్ధి చేసి వీధి దీపాలు, స్నానపు గదులు, పూల మొక్కల పెంచొచ్చన్నారు. గ్రామాల్లో అందరీ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ పరంగా గ్రామ పంచాయతీ ఒక డ్రోన్ కొనుగోలు చేసి ఉపాధి పొందవచ్చు లాంటి అంశాల ద్వారా గ్రామ అభివృద్ధి ప్లాన్ తయారు చేసేలా ఉండాలని జిల్లా కలెక్టర్ గ్రామ సర్పంచులకు, ఎంపిడిఓలకు సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తెరిగి భవిష్యత్తులో ఉపయోగపడేలా చూడాలన్నారు. గ్రామాల్లో టాయిలెట్స్ లేక ఇబ్బంది పడే వారి కోసం కమ్యూనిటీ టాయిలెట్స్ ఏర్పాటు చేయవచ్చున్నారు. గ్రామ ఖర్చును తగ్గించు గ్రామ ఆదాయాన్ని పెంచుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సిసి రోడ్లు ఉపాధి హామీ పనుల ద్వారా ఇంకా ఐదు వందల కోట్లకు అనుమతులు ఇవ్వడానికి కలెక్టర్ కు అవకాశం ఉంటుందని అందుకు సిసి రోడ్లు, బిటి రోడ్లు కాకుండా గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ గ్రామ సర్పంచులు, ఎంపిడిఓలను ఆదేశించారు. గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు చర్యలు తీసుకోవాలన్నారు. రూఫ్ ఉన్న ప్రతి ఇంటి పైన సోలార్ ఫలకల ఏర్పాటు చేయాలన్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కిలో వాట్ కు 30 వేలు, రెండు కిలో వాట్ లకు 60 వేలు, మూడు కిలో వాట్ యూనిట్లకు 78 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండి కూడా బిసిలకు 20వేల రూపాయలు సబ్సిడీ ఇచ్చే సదుపాయం ఉందన్నారు. మిగిలిన మొత్తానికి బ్యాంకులు రుణం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక కిలో వాట్ సోలార్ ఫలకల ఏర్పాటు ద్వారా రోజుకు 4 యూనిట్ల, 2 కిలో వాట్ల సోలార్ ఫలకల ద్వారా రోజుకు 8 యూనిట్లు, 3 కిలో వాట్ల సోలార్ ఫలకల ద్వారా రోజుకు 12 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా గ్రామాల్లో పాడి పశువులు ఎక్కువగా ఉంటాయి కాబట్టి బయో గ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేసి వాటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గ్రామ సర్పంచులకు వివరించారు.



## ప్రత్యేక అవసరాలు కలిగినటువంటి వారు అన్ని రంగాల్లో రాణించాలి

**(3వ పేజీ తరువాయి)** ప్రభుత్వ మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుందని అందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీమతి శైలజ, డిఈఓ ప్రసాద్ బాబు, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యులు నరసింహులు, విద్యాశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## హనుమంత వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణుల విహారం







**ఒంటిమిట్ట పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 9 :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం రాత్రి విశేషమైన హనుమంత వాహన సేవ వైభవంగా జరిగింది. శ్రీ సీతారామ లక్ష్మణులు ప్రియభక్తుడైన హనుమంత వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటల నుండి కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి దర్శించుకున్నారు. త్రేతాయుగంలో రామభక్తునిగా, భగవద్భక్తులలో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధిగాంచిన వారు హనుమంతుడు. రాముడు భక్తాగ్రగణ్యుడైన హనుమకు ఆత్మతత్వాన్ని బోధించినట్లు ప్రాచీన వాఙ్మయం ద్వారా తెలుస్తోంది. హనుమంతుడు తనను సేవించే భక్తులకు ఆత్మోన్నతిని ప్రసాదిస్తున్నారు. దాసభక్తికి ప్రతీకగా స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగుతున్నారు. వాహన సేవలో డెప్యూటీ ఈఓ శ్రీ నటేష్ బాబు, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## సీపీఎం భవిష్యత్ ఉద్యమాలు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి ,ఏప్రిల్ 9 :** పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తు ఉద్యమ కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం సిపిఎం ప్రాంతీయ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మే ఒకటిన మే డే, సుందరయ్య జయంతి, 19న సుందరయ్య వర్ధంతి నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మే 8, 9, 10న తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం వేదికగా సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించి సుందరయ్య స్ఫూర్తితో క్షేత్రస్థాయి పోరాటాలకు వెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. ఆరు నెలలు-ఆరు కమిటీల నినాదంతో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. మోడీ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం చేపట్టబోయే భవిష్యత్తు పోరాటాలకు ప్రజలు అన్ని విధాలా అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి గంధం మణి, రెడ్డిపల్లి సురేష్, రాధమ్మ, రమణయ్య, వెంకటేష్, గురునాధం, మనోహర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## బెలుగుప్ప మండల కేంద్రంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం



**పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 9 :** పిజిఆర్ఎస్‌లో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ తో కలిసి అర్జీలను స్వీకరించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బెలుగుప్ప మండల కేంద్రంలోని వాసవి కల్యాణ మండపం పక్కన ఉన్న స్థలంలో బుధవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తో కలిసి గౌరవ రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ అర్జీలను స్వీకరించారు.

## ఒంటరి ఇళ్లవద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోండి

### పిల్లలను చెరువులు బావుల వద్దకు పంపకండి : సిఐ బొడ్డు ప్రసాద్



**పలమనేరు పెన్ పవర్ ఏప్రిల్ 09 :** ఒంటరి ఇళ్లవద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గంగవరం మండల సి.ఐ.బొడ్డు ప్రసాద్ సూచించారు.బుధవారం పోలీస్ స్టేషన్ నందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రామాలకు దూరంగా ఉన్న ఇల్లు మరియు ఒంటరి ఇల్లు ఉన్నచోట తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,లేదా సెన్సార్ లాక్స్ బిగించుకోవాలని సూచించారు.అలాగే వేసవి సెలవులు వచ్చాయి కాబట్టి ఈతరాని పిల్లలను చెరువులు బావుల వద్దకు పంపడం మంచిది కాదని,పంపి దానివలన ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. ముఖ్యంగా తాగి వాహనాలు నడపొద్దని, హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఆయన సూచించారు.

# శ్రీ సీతారాముల కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి







**కడప పెన్ పవర్ ఏప్రిల్ 9 :** శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 11 వ తేదీ న జిల్లాకు రానున్న నేపథ్యంలో ఒంటిమిట్టలో ముందస్తు భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పి అశోక్ కుమార్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది తో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒంటిమిట్టలో అన్ని ప్రాంతా లను పరిశీలించారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బసచేయనున్న టీటీడీ అతిథి గృహాన్ని పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం శ్రీరాముని ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొను ప్రాంతాల కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఆలయ రంగ మండపం, అంతరాలయాలను పరిశీలించారు. అనంతరం కళ్యాణ మహోత్సవం జరిగే ప్రాంతంలోని మండపాన్ని, వివిఐపి గ్యాలరీలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఒంటిమిట్ట సీతారాముల కళ్యాణం పురస్కరించుకుని.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజులు జిల్లాలో పర్యటించనున్నారన్నారు.భద్రత ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కడప ఎయిర్ పోర్టు, ఒంటిమిట్ట టీడీపీ అతిథి గృహం వద్ద ప్రోటోకాల్ మేరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా వుండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కళ్యాణ మహోత్సవానికి దాదాపుగా 70వేలు మంది భక్తులు రానున్నట్లు తెలిపారు. సాయంత్రం కళ్యాణ వేదిక వద్ద మరో సారి ఏర్పాట్లపై జేసీ అదితి సింగ్ తో కలిసి జిల్లా ఆయా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాక్ డ్రిల్ కు సంబంధించి అధికారులకు తగు సూచనలు చేశారు.అగ్నిమాపక, వైద్య ఆరోగ్య,రెవెన్యూ,పోలీస్ శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సెక్టార్ అధికారులను ఆదేశించారు. గ్యాలరీలు, జనరేటర్ ఏర్పాటు చేసిన ప్రాంతం,కంట్రోల్ రూమ్స్, వీఐపీ ఎంట్రీ మార్గాలను, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసిన ప్రాంతాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ కుమార్, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నాగరాజు, జిల్లా అగ్నిమాపక ధర్మారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబంపై రూ.500 భారం




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 9 :** శ్రీకాళహస్తి పెరిగిన నిత్యావసర ధరలకు తోడు గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం ద్వారా ప్రతి కుటుంబంపై మోడీ ప్రభుత్వం నెలకు రూ.500 అదనపు బారాన్ని మోపనుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద సీపీఎం నేతలు మంగళవారం నిరసన తెలిపారు. ఇప్పటికే విద్యుత్, నిత్యావసర ధరలు పెరిగి అల్లాడుతున్న దేశ ప్రజానీకంపై గ్యాస్ సిలిండర్ పై రూ.50, పెట్రోలు, డీజిల్ పై రూ.5 పెంచి మోడీ గుది బండగా మారాడంటూ విమర్శించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఇదంతానంటూ మండిపడ్డా ?. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు విష యంలో మోడీ వెనక్కి తగ్గకుంటే దేశవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. నాయకులు గంధం మణి,రెడ్డిపల్లి సురేష్, రమణయ్య, వెంకటేష్, గురునాధం, రాధమ్మ, మనోహర్,కుమార్, రాజా, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పీపీపీ మోడల్‌లో పలమనేరు బస్టాండ్ అభివృద్ధి

- నూతన హంగులతో నిర్మాణానికి ప్రణాళికలు - షాపింగ్ రూములతో పాటు పెరగనున్న ఫ్లాట్ ఫామ్‌లు
- మరిన్ని బస్సు సర్వేసుల పునరుద్ధరణ



**పలమనేరు పెన్ పవర్ ఏప్రిల్ 09 :** పలమనేరు ఆర్టీసీ బస్టాండు రూపు రేఖలు మారనున్నాయి. ఇక్కడి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి చొరవతో ప్రభుత్వం ఈబస్టాండ్ ను పీపీపీ (ప్రభుత్వం,ప్రజలు,ప్రైవేట్) విధానం ద్వారా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసింది.ఈ విధానం ద్వారా ప్రస్తుత బస్టాండ్ దశ,దిశ మారడమే గాక ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగానూ నిలవనుంది.ప్రస్తుతం ఇక్కడ నాలుగు ఫ్లాట్ ఫాంలు మాత్రమే కలిగి ఉండడంతో ప్రయాణికుల రద్దీతో ఏమాత్రం సరిపోవడం లేదు.దీనికి తోడు గత ప్రభుత్వంలో దాదాపు 13 సర్వీసులను అప్పటి ప్రజా ప్రతినిధులు ఇతర ప్రాంతాలకు తరలించడంతో ఎంతో ప్రాశస్త్యం ఉన్న డిపో మరియు బస్టాండ్ లు వెలవెల పోయే పరిస్థితికి చేరింది.ఇలా ఉండగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి డిపో పూర్వ వైభవానికి పూనుకున్నారు. అందులో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన రెండు మూడు నెలల్లోనే నూతన సర్వీసులను ఆయన ప్రారంభించారు. అందులో భాగంగా ప్రస్తుతం బస్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. పీపీపీ విధానం ద్వారా బస్టాండ్లో సుమారు పది ఫ్లాట్ ఫాంల ఏర్పాటుతో పాటు షాపింగ్ గదుల నిర్మాణం ప్రయాణికులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.దీంతో బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో డిపో మేనేజర్ టి.కె.స్వామి మరియు సిబ్బందితో కలసి ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రయాణికులకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆ కోణంలో ప్రణాకలు రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు.ఇక్కడి నుంచి తరలించిన బస్సు సర్వీసులు త్వరలోనే తిరిగి పునరుద్ధరించేలా చూడాలని ఆయన ఆదేశించారు.ఇలా ఉండగా గురువారం బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం- దాసర్లపల్లె సర్వీసును ప్రారంభించనునట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఏదేమైనా పీపీపీ విధానంలో పలమనేరు బస్టాండుకు మహర్దశ రానుంది.

## పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్, ధరలను వెంటనే తగ్గించాలి : సిపిఎం





**ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 9 :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ,పెట్రోలు, డీజిల్, ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో స్థానిక కళాజ్యోతి సర్కిల్ నందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు ఎస్ హెచ్ భాష, ఏ.మారుతి,సిఐటియు నాయకులు జె వి రమణ, టి.అయుబ్ ఖాన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం, గ్యాస్ సిలిండర్ల పైన పెంచిన 50 రూపాయలు. (గోరుచుట్టుమీద రోకలిపోటు) అన్నట్లు. బడుగు బలహీన వర్గ ప్రజలు. పేదలు. మోయలేని విధంగా భారాన్ని పెంచారని మండిపడ్డారు.అదేవిధంగా నిత్యవసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయని, డీజిల్. పెట్రోల్ .ధరలు పెంచుతున్నారని, విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచుతున్నారని, ఒకవైపు పేద బడుగు బలహీన వర్గ ప్రజలు ఉపాధి పనులు లేక వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల జీవన పరిస్థితులు మరింత దిగజారుతున్నాయని, కార్మికులకు పేదలకు. పనులు లేక ఇబ్బందులు పడుతుంటె వారిని మరింత ఇబ్బందులకు గురి చేసే విధంగా డీజిల్. పెట్రోల్. గ్యాస్ ధరలను, నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతూ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు. ప్రజలపై మరింత భారాలను మోపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కావున ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరలను, డీజిల్. పెట్రోల్. ధరలను, విద్యుత్ ధరలను తగ్గించాలని, ఆ విధంగా కాని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పేద ప్రజలను రైతులను. కార్మికులను కలుపుకొని పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ప్రభుత్వానికిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్.ఆదినారాయణ, ఎస్. హైదర్ వలీ, చేనేత కార్మిక సంఘం నాయకులు, గుంపు హరి, వి.వెంకటస్వామి, ఏ. ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## సాగు త్రాగు నీరు -సంక్షేమం అభివృద్ధి




**పులివెందుల: పెన్ పవర్ ఏప్రిల్ 9 :** వైఎస్ జగన్ ప్రభుత్వంలో 90 శాతం పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జలజీవన్ మిషన్ వాటర్ ఇంటిగ్రేటెడ్ విధానం, క్రికెట్ స్టేడియం ను షాపింగ్ కాంప్లెక్స్ లు, ఆగిపోయిన సిమెంట్ రోడ్లను పూర్తిగా నిర్వీర్యం చేసి ఇప్పుడు కూటమి నాయకులు నాటకాలు ఆడుతున్నారు. ఈ రోజు పులివెందుల ప్రాంతం లో వ్యవసాయం నీటి ఆధారిత పంటలు అయిన అరటి, దానిమ్మ, డ్రాగన్ హార్టికల్చర్ వైపు రైతులు వెళ్తున్నారంటే దానికి పులివెందుల ప్రాంతానికి సాగు నీళ్లు అందించిన ఘనత వైఎస్ కుటుంబానిదే జలజీవన్ మిషన్ క్రింద త్రాగునీటి కోసం మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ద్వారా ఇంటి ఇంటికి నీరు సరఫరా చేసే పనులు 95 శాతం పూర్తి చేస్తే మిగిలిన 5 శాతం పనులు పూర్తి చేయడానికి ఏడాది కావస్తున్నా పూర్తి చేయలేని దుస్థితి లో కూటమి ప్రభుత్వం ఉంది. కాంట్రాక్టర్ లు కాదు ప్రభుత్వమే ఇక్కడ ఉన్న స్టేడియం ను రద్దు చేసి నిధులు లేకుండా చేసి వాయల్పాడు లో ఏర్పాటు చేస్తున్న స్టేడియం కు స్ప్రింక్లర్ మోటార్‌లు, మొత్తం మెటీరియల్ ను తరలించారు, నిరూపించడానికి మేము సిద్ధం మీరు సిద్ధమా.. రెండు సంవత్సరాలు కోవిడ్ వచ్చిన పులివెందుల అభివృద్ధితో పాటు రాష్ట్ర అభివృద్ధిని కొనసాగించిన ఘనత ఒక్క జగన్ కే సాధ్యం. ఇప్పటికైనా కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటి వరకు ఎంత నిధులు ప్రభుత్వం నుంచి విడుదల చేశారో చూపించాలి. పులివెందుల మోడల్ టౌన్ కు గానీ మున్సిపాలిటీ కి గానీ ఒక్క రూపాయి కూడా విడుదల చేసిన పాపాన పోలేదు. కమీషన్ లు తీసుకొని కక్కుర్తి పడాల్సిన అవసరం వైఎస్ కుటుంబానికి లేదు. కొన్ని కోట్ల రూపాయలు సొంత నిధులు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేస్తున్న మాట వాస్తవం కాదా పులివెందుల ప్రాంతం అన్న ఇక్కడి ప్రజలు అన్న చంద్రబాబు కు విపరీతమైన కోపం, కక్ష అందుకే మిగతా మునిసిపాలిటీ లకు నిధులు వెచ్చించి ఇక్కడ మాత్రం శూన్యం. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా కనీసం ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయకపోవడం దారుణం. కార్యక్రమం లో వైఎస్సార్సిపి నాయకులు పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ చిన్నప్ప, నూర్ భాషా సంఘం అధ్యక్షులు రసూల్, వైస్ చైర్మెన్ హఫీజ్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమౌళి,కౌన్సిలర్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన నాయకులు చెంగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**సూళ్లూరుపేట, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 9 :** మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి ప్రేత్యేక పూజలు నిర్వహించిన సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన నాయకులు.నిత్యంప్రజాహితం కోసం పరితపించే ఆంధ్ర రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి చిన్న కుమారుడు చిఎఎ మార్క్ శంకర్ సింగపూర్ లో జరిగిన అగ్నిప్రమాదంలో గయపడి హాస్పిటల్లోచికిత్సపొందుతునందున, తను త్వరగా కోలుకొని పూర్తీ ఆరోగ్యవంతుడిగా తిరిగి రావాలని సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జి ఉయ్యాల ప్రవీణ్ మరియు పార్టీ నాయకులు. మార్క్ శంకర్ తో పాటు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మిగతా 20మంది చిన్నారులు కూడా త్వరగా కోలుకోవాలని అమ్మవారిని ప్రార్దించిన జనసేన పార్టీ నాయకులు. ప్రజలకి మంచి చేయడం తప్ప ఎటువంటి స్వార్థం ఆశించని మంచి మనసున్న పవన్ కళ్యాణ్ గారికి మరియు వారి కుటుంబానికి ఆ భగవంతుని ఆశీస్సులు, ప్రజల దీవెనలు ఎల్లపుడు ఉంటాయని ఉయ్యాల ప్రవీణ్ తెలియజేసారు.ఈకార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణ రావు , తులసి రెడ్డి, బాలు శెట్టి, గుర్రం చిరంజీవి, మల్లం విజయ్, తొపాని బాబు, తీపలపూడి రమణ, కుంపటి శ్రీను, చంద్రశేఖర్, తాతంశెట్టి బాలాజీ, దిలీప్, నాగరాజు ,దిలీప్, శేఖర్, రాజు, వీరమహిళ పద్మజ కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామకంఠం భూములు కాపాడండి

- జనసేన ఇంచార్జి వినుత కోటా వినతి ఇచ్చిన మల్లంపల్లి గ్రామస్థులు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 9 :** ఏర్పేడు మండలం, అముదూరు పంచాయతీ లోని మల్లంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 300/10 లో 1.92 ఎకరాలు ప్రభుత్వ గ్రామకంఠం భూములను వైసీపీ కి చెందిన ఎంపీపీ కి సంబంధించిన వారు కబ్జా చేసి పట్టాలు చేసుకోవడానికి పన్నాగాలు పన్నుతున్నారని, ఆ భూమిని కాపాడాలని ఈరోజు గ్రామస్థులు జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి వినుత కోటా శ్రీకాళహస్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కలిసి వినతి ఇచ్చారు. ఈ ప్రభుత్వ గ్రామకంఠం భూమిలో గ్రామస్థులు కోసం ,ప్రజల కోసం ప్రభుత్వ ఆసుపత్రి లేక పిల్లలకి ప్లే గ్రౌండ్ లాంటివి ఏర్పాటు చేసుకోవాలి అనుకుంటున్నామని , అలా కాకుండా కొంత మంది కబ్జా చెయ్యాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకుని వెళ్ళినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ సమస్యను శ్రీమతి వినుత కోటా వెంటనే శ్రీకాళహస్తి ఆర్.డి.ఓ భానుప్రకాష్ రెడ్డి తెలిపి మల్లంపల్లి గ్రామస్థులు భూముల కబ్జాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన ఆర్.డి.ఓ తక్షణమే చర్యలు తీసుకుని కబ్జాలను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు.

## ఏపీఎస్ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా
# న్యాయవాది గుమ్మళ్ల రాజేశ్వరరావు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 9 :** తిరుపతి జిల్లా ఏపీఎస్ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా శ్రీకాళహస్తి న్యాయవాది గుమ్మల్ల రాజేశ్వర రావును నియమించినట్లు ఉత్తర్వులు అందించారు. శ్రీకాళహస్తిలోని అదనపు జిల్లా కోర్టు ఏర్పడిన తర్వాత మొట్ట మొదటిసారి ఏపీఎస్ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది గా నియమించడం చాలా సంతోషంగా ఉందని గుమ్మల్ల రాజేశ్వరరావు తెలిపారు. ఏపీఎస్ ఆర్టీస లోని పెండింగ్ కేసులను త్వరతగతిన పరిష్కరించుటకు ప్రయత్నిస్తానని తెలిపారు.

## ఎస్.టి.ఓ.ను కలిసిన పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



**పలమనేరు పెన్ పవర్ ఏప్రిల్ 09 :** పలమనేరు ఉప ఖజానాధికారిగా బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణయ్యను పలమనేరు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతము ఉన్న అద్దె భవనంలోని ఉప ఖజానా కార్యాలయం పెన్షనర్లకు అసౌకర్యంగా ఉందని 80,90 సంవత్సరాల వయసు మళ్ళిన వ్యక్తులు తమ సమస్యల కోసం మొదటి అంతస్తులోకి వెళ్లలేక పోతున్నారని, అంతేకాకుండా గదులు ఇరుకుగా ఉండడంతో కనీసం నిలబడడానికి స్థలం కూడా లేదని, కావున వెంటనే దీనిని సౌకర్యవంతంగా ఉన్న క్రింది అంతస్తుకు మార్చాలన్నారు. అదేవిధంగా కొన్ని సమస్యలు సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉంటున్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘనాయకులు నాగభూషణం,రెడ్డి శ్రీనివాసులు,విజయ్ కుమార్,దామోదరం, రామప్ప,జగదీష్, రాజారెడ్డి,తులసిరెడ్డి, పరశురాం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుభాష ఔన్నత్యాన్ని మరింతగా చాటాలి
## పైనేని తులసీనాథం నాయుడు



**తిరుపతి పెన్ పవర్ (ఏప్రిల్ 09) :** తెలుగుభాష ఔన్నత్యాన్ని మరింతగా చాటిచెప్పడానికి ఉగాది పురస్కార గ్రహీతలందరూ కృషి చేయాలని సంస్కృత విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కృష్ణమూర్తి కోరారు. బుధవారం తిరుపతి వేమన విజ్ఞానకేంద్రంలో పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఉగాది పురస్కార గ్రహీత పైనేని తులసినాథం నాయుడు,పుష్ప దంపతులను ఆయిన సత్కరించారు. పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయ న్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు, నాగార్జున, అంకమ నాయుడు, సర్వోత్తమరావు, గంగాధర ప్రసాద్, పైనేని మురళి,రేణుక తదితరులు పాల్గొన్నారు.

# స్కిట్ కాలేజీకీ పునర్ వైభవం
## బొజ్జల వెంకట సుధీర్ రెడ్డితోనే సాధ్యం
## టిడిపి యువనేత సాలపాక్షి నవీన్



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 9 :** తలమానికమైన శ్రీకాళహస్తికి కాలేజ్ మళ్లీ పునర్ వైభవం రావాలంటే టిడిపి, జనసేన, బిజెపి, కూటమి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ తోనే సాధ్యమవుతుందని టిడిపి యువనేత సాలపాక్షి నవీన్ స్పష్టం చేశారు. సందర్భంగా 555 మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు ఎంతో ఘన చరిత్ర ఉందని మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి శాసనసభ్యుడుగా ఉన్నప్పుడు 1991 ప్రాంతంలో ఈ కళాశాలకు అనుమతి తెచ్చారని శ్రీకాళహస్తి నాయుడుపేట ప్రధాన రహదారి పక్కనే సుమారు 55 ఎకరాల విస్తీర్ణంలో ఈ కళాశాల నిర్మించారని వేలాది మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసించి దేశ విదేశాల్లో స్థిరపడ్డి ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. అదేవిధంగా స్కిట్ కళాశాలకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఏర్పడిందని అప్పట్లో ఈ కళాశాలలో మెకానికల్ విభాగానికి నిరుపేద విద్యార్థులు మెకానికల్ విద్యను అభ్యసించాలంటే లక్షలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడేదని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చొరవతో శ్రీకాళహస్తీశ్వర ఆలయ నిధులతో నిరుపేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పిస్తూ వారు కూడా ఇంజనీరింగ్ విభాగంలో మెకానికల్ కోర్సు తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని తాను కూడా స్కిట్ కళాశాల పూర్వపు విద్యార్థిని గుర్తు చేసుకున్నారు. గత ప్రభుత్వాలు హాయంలో స్కిట్ కళాశాల ఒక వెలుగు వెలిగిందని 2019 ఎన్నికల్లో నేటిపాలకులు సిట్ కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామని చెప్పి నేడు అధికారంలోకి వచ్చాక వైకాపా ప్రభుత్వం కళాశాల మూసి వేయించారని తద్వారా ఉద్యోగులు న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రస్తుతం సాంకేతిక విద్యా ఇంజనీరింగ్ విద్య కోసం శ్రీకాళహస్తి వాసులు ఇతర ప్రాంతాలకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా తన తండ్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి హయాంలో ఒక వెలుగు వెలిగిన స్కిట్ కళాశాలకు తిరిగి పునర్వైభవం తీసుకొస్తానని హామీ ఇచ్చి ఉన్నారని ఇచ్చిన హామీని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తప్పక నెరవేర్చి స్కిట్ కళాశాలకు పునర్ వైభవం తీసుకొచ్చి అభివృద్ధి ప్రదాత తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పాలనను తిరిగి అందిస్తారని తెలిపారు. అదేవిధంగా టిడిపి, జనసేన, బిజెపి, కూటమి ఏపీలో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మొట్టమొదటి సంతకం మెగా డీఎస్సీ పైనే ఉంటుందని అదేవిధంగా రానున్న ఐదు సంవత్సరాల్లో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి తద్వారా 20 లక్షల ఉద్యోగాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తారని అదేవిధంగా ఉద్యోగ ఉపాధి అవకాశం లభించేంతవరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3000 రూపాయలు అందజేస్తారని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్లో అవినీతి ఆరాచక పాలనకు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రజలు. సం సిద్ధంగా ఉన్నారని శ్రీకాళహస్తిలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని మే 13న జరగనున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శ్రీకాళహస్తికి తలమానికమైన సిట్ కాలేజీకి పునవైభవం శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తోనే సాధ్యమని స్పష్టం చేశారు.

# ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి వారి
# సీతారామకల్యాణ ఏర్పాట్లను పరిశీలించిన టిటిడి అదనపు ఈవో








**ఒంటిమిట్ట పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 9 :** ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న శ్రీసీతారాముల కల్యాణం ఏర్పాట్లను టిటిడి తిరుపతి జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మంతో కలసి టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీకోదండరామ స్వామి కల్యాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న సందర్భంగా, ఒంటిమిట్టలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరి పరిశీలించారు. ముందుగా ఒంటిమిట్టలోని టిటిడి అతిథి గృహం వద్ద ముఖ్యమంత్రివర్యులు బస చేసే గదులలో ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా అప్రమత్తంగా ఉండాలని, పరిసర ప్రాంతాలలో పచ్చదనం, పుష్పాలంకరణలు తాజా పుష్పాలతో ఏర్పాటు చేయాలన్నారు. అటు తర్వాత టిటిడి అతిథి గృహం నుండి ఆలయం వరకు పరిసర ప్రాంతాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఆలయంలోపుల ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో నిల్వ వున్న సామాగ్రి, వస్తువులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలయం అంతా కలియ తిరిగారు. ఆలయం నుండి కల్యాణ వేదిక వరకు విద్యుత్ కాంతులు, పుష్పలంకరణలలో రాజీ లేకుండా నాణ్యంగా పనులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో జిల్లా యంత్రాంగం, టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. భక్తులు అందరికి అన్నప్రసాదాలు, స్వామివారి కల్యాణ తలంబ్రాలు, శ్రీవారి లడ్డు ప్రసాదం, త్రాగునీరు, మజ్జిక పంపిణీ చేస్తామని చెప్పారు. భక్తుల రద్దీకి తగ్గట్లు జిల్లా రెవిన్యూ, పోలీసు, స్థానిక పంచాయతీ, టిటిడి అధికారులు సమిష్టిగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు ప్రవేశించే, నిష్క్రమణ ప్రాంతాలలో మరింత అప్రమత్తంగా అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సీఈ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సామాన్యులకు భారమైన పెరిగిన గ్యాస్ ధరలు



**పలమనేరు పెన్ పవర్ ఏప్రిల్ 09 :** సామాన్యులకు ప్రస్తుతం పెరిగిన గ్యాస్ ధరలు భారమైనదని పట్టణ సీపీఎం నాయకులు అన్నారు. బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద పెరిగిన గ్యాస్ ధరలపై నిరసన తెలిపారు. ఈసందర్భంగా పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా మాట్లాడుతూ.. గ్యాస్ ధర 50 రూపాయలు పెంచినందుకు తీవ్రంగా ఖండిస్తున్నామని,ఇలా కేంద్ర ప్రభుత్వము ధరలను పెంచుకుంటూ పోతుంటే సామాన్యులు ఎలా బతకాలని అన్నారు. గృహావసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.50 మేర పెంచింది. ఈ పెరిగిన ధరలు మంగళవారం నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సామాన్య వినియోగదారులపై, రాష్ట్ర ప్రభుత్వంపై కలిపి ప్రతినెలా భారీ ఆర్థిక భారాన్ని మోప నుంది,ఆంధ్ర రాష్ట్రం లో గ్యాస్ వినియోగం గణనీయంగా ఉంది. అంచనాల ప్రకారం.. రాష్ట్రంలోని వినియోగదారులు ప్రతి నెలా దాదాపు కోటి వరకు వంటగ్యాస్ సిలిండర్లను కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరల పెరుగుదల వలన నేరుగా నెలకు అదనంగా రూ.50 కోట్ల భారాన్ని మోపనుంది. ఇది ఇప్పటికే అధిక ధరలతో సతమత మవుతున్న సామాన్య ప్రజలకు మరింత భారంగా మారనుంది. మరోవైపు..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉజ్వల పథకం ఈ ధరల పెరుగుదల కారణంగా అదనపు ఆర్థిక భారాన్ని ఎదుర్కోనుంది. ఈ పథకం కింద రాష్ట్రంలో దాదాపు 32.90 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం కేవలం రూ. 500కే గ్యాస్ సిలిండర్ను అందిస్తోంది. కేంద్రం ధరలు పెంచినప్పటికీ.. ఈ లబ్ధిదారులకు అదే ధరకు సిలిండర్ను సరఫరా చేస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చింది. దీని ప్రకారం, పెరిగిన ఒక్కో సిలిండర్పై రూ.50 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం రాయితీ రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనుంది. ఈ చర్యతో ఉజ్వల పథకం లబ్ధిదారులపై ప్రస్తుత ధరల పెరుగుదల ప్రభావం ఉండదు. అయితే..దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా అదనంగా రూ.21.45 కోట్లను భరించాల్సి ఉంటుంది. ఇతర వినియోగదారుల పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఉజ్వల పథకం పరిధిలోకి రాని దాదాపు 33.82 లక్షల మంది విని యోగదారులు ఈ ధరల పెరుగుదల కారణంగా తీవ్రంగా నష్టపోనున్నారు. వీరికి ఎలాంటి రాయితీ లేనందున.. వారు కొను గోలు చేసే ప్రతి సిలిండర్పై అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. ఇది వారి నెలవారీ ఖర్చులపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని ఆయన అన్నారు. ఇందులో పట్టణ కమిటీ రాజా, జయంతి,శ్రీరామయ్య, సభ్యులు సుధాకర్, ప్రతాప్,ధనమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చెప్పమ్మా..ఏమందు... ఆ భగవంతుడు నిన్ను ఆశీర్వాదిస్తాడు ఆమందివ్వండి..
## పెన్ పవర్తో సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి.. అనుబంధం లేకుండా ప్రేమించండి..
## మనల్ని బాధపెట్టేది.. ఆఅనుబంధమే..



**పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ కడప ఏప్రిల్ 9 :** చదివే ముందు... చాలా సున్నితంగా కళ్ళు మూసుకోండి... మీ దృష్టిని మీ హృదయం మీదకి తీసుకురండి... మీ హృదయంలో తల్లి ప్రేమను అనుభూతి చెందండి.... మెల్లగా కళ్లు తెరిచి చదవడం ప్రారంభించండి... మరుపును కలిగించే మందు నాకు ఒక మందుల దుకాణం ఉంది, ఆ రోజు దుకాణం చాలా రద్దీగా ఉంది. నేను కస్టమర్లకు మందులు ఇస్తూండగా, దుకాణానికి కొంచెం దూరంలో చెట్టు కింద ఒక వృద్ధురాలు నిలబడి ఉంది. నేను రెండు మూడు సార్లు ఆమెను చూసినప్పుడు, ఆమె నా దుకాణం వైపే చూస్తూండటం నేను గమనించాను. నేను కస్టమర్లకు మందులు ఇస్తూనే ఉన్నాను, కానీ ఆ వృద్ధురాలి గురించి, ఆమె అక్కడ ఎందుకు నిలబడి ఉంది, ఇటువైపే ఎందుకు చూస్తోంది అన్న ఆసక్తి కలిగింది. కస్టమర్లు తక్కువగా ఉన్నప్పుడు, నేను నా షాప్లో పనిచేసే అబ్బాయికి షాప్ కౌంటర్ అప్పగించి, ఆమె వద్దకు వెళ్లాను. ఆమెను ఇలా అడిగాను, "ఏమైంది అమ్మా, మీకు ఏదైనా కావాలా? చాలాసేపటి నుండి మీరు ఇక్కడ నిలబడి చూస్తున్నారు. బయట చాలా ఎండగా ఉంది, అందుకని మీకు అవసరమైనది ఏమైనా కావాలేమోనని అడుగుతున్నాను." వృద్ధురాలు మాట్లాడటానికి కొంచెం సంకోచించింది. కాస్త ధైర్యం తెచ్చుకుని ఆమె మాట్లాడటం ప్రారంభించింది, "నాయనా, నాకు ఇద్దరు కొడుకులు. ఇద్దరూ వేరే నగరంలో ఉంటున్నారు. ప్రతి వేసవి సెలవుల్లో, వారు మమ్మల్ని కలవడానికి తమ పిల్లలతో వస్తారు.

అయితే ఈసారి మాత్రం వాళ్ళు ఎక్కడో పర్వతప్రదేశాల్లో సెలవులు గడపాలని నిర్ణయించుకున్నారు. కాబట్టి ఈసారి వారు మమ్మల్ని కలవడానికి రారు నాయనా. నాకు ఈ విషయం నిన్న సాయంత్రమే తెలిసింది. నిన్న రాత్రి దీని గురించి ఆలోచిస్తూ చాలా అశాంతికి గురయ్యాను.... ఒక్క నిమిషం కూడా నిద్ర పట్టలేదు.

ఈరోజు మీ షాపులో మందులు కొందామని అనుకున్నాను. కానీ షాపులో జనాన్ని చూసి, ఇక్కడే వేచి ఉండి, షాపులో ఎవరూ లేనప్పుడు మందు గురించి అడగాలని అనుకుంటున్నాను."

"అర్థమయిందమ్మా ... చెప్పు తల్లీ.. నీకు ఏ మందు కావాలి? నేను తెచ్చిస్తాను!" అని అన్నాను.

"పిల్లల్ని మరిచిపోవడానికి మందు ఏమైనా ఉందా ...?

ఉంటే తీసుకురా నాయనా..... భగవంతుడు నిన్ను ఆశీర్వదిస్తాడు..." అని అంది.

ఆపై మాటలు వినడానికి నాకు ధైర్యం చాలలేదు. నా చెవులు మొద్దుబారిపోయాయి. నేను ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా దుకాణానికి వైపుకి తిరిగాను.

ఎందుకంటే వృద్ధురాలికి కావాల్సిన మందు ఆమె కుమారుల వద్ద మాత్రమే దొరుకుతుంది, నావద్ద దొరకదు. ఇది ప్రపంచంలో ఏ మందుల దుకాణంలోనూ దొరకదు..

ఇప్పుడు నేను కౌంటర్ వెనుక నిలబడి ఉన్నాను.

నా మనసులో ఆలోచనల తుఫాను, ఆ చెట్టుకింద నిలబడి ఉన్న తల్లిని కళ్ళెత్తి చూడడానికి కూడా ధైర్యం చేయలేకపోయాను. నా దుకాణం మొత్తం ఆ అమ్మకి పనికిరాకుండా పోయింది.. ఎంత నిస్సహాయతను అనుభవించానో ఆ భగవంతుడికే తెలుసు!

ఈ వేసవి సెలవుల్లో ఎవరైనా తమ సొంతూరికి వెళ్లకుండా వేరే ప్రదేశానికి వెళుతున్నారని నేను విన్నప్పుడల్లా ఆ వృద్ధురాలి తపన నన్ను ఇప్పటికీ బాధిస్తుంది.



అనుబంధం లేకుండా ప్రేమించడం నేర్చుకోండి, ఎందుకంటే అనుబంధం మనల్ని బాధపెడుతుంది, ప్రేమ కాదు.

**సేకరణ. సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి
ఎంఏ బీఈడీ. తెలుగు అధ్యాపకులు,
పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్.
ముక్తి హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా...**

## పిజిఆర్ఎస్ పిటిషన్లను క్షేత్రస్థాయికి...
### ప్రత్యేక అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలు



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 09 :** పిజిఆర్ఎస్ పిటిషన్ లను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ సెక్టార్, రీసర్వే, తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, తదితరులతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పిజిఆర్ఎస్ పిటిషన్ లను నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలన్నారు. అందుకు సంబంధించిన నివేదికలను విధిగా ఈ ఆఫీస్ లోనే జిల్లా కలెక్టర్ కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆ శిక్షణలో తాను, జెసి కూడా పాల్గొనడం జరుగుతుందన్నారు. చుక్కల భూమి సమస్యల పరిష్కారంలో మంచి ఫీడ్ బ్యాక్ వస్తోందని దీన్ని ఇలాగే కొనసాగించాలని అధికారులకు సూచించారు. పట్టాదార్ పాస్ బుక్ కు ఆధార్ తో అనుసంధానం చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల క్లెయిమ్స్ కు సంబంధించి అన్ని క్లెయిమ్స్ లను కూడా వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రెగ్యులరైజేషన్ స్కీం 2025 కు సంబంధించి ప్రతిరోజు ఆర్డిఓ లతో సమీక్షలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు కేశవనాయుడు, ఆర్బీఎస్కె శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, కలెక్టరేట్ సెక్షన్ సూపరిం టెండెంట్లు యుగేశ్వరి దేవి, రియాజుద్దీన్, సర్వే ఏడి రూప్ల నాయక్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, తహసీల్దార్లు, తదితరులు పాల్గొంటున్నారు.


## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన కలెక్టర్ రంజిత్ భాష




**కర్నూలు, పెన్ పవర్ ఏప్రిల్ 9 :** కలెక్టరేట్ నుండి హౌసింగ్, పిజిఆర్ఎస్, పీఆర్ వన్ యాప్, ఉపాధి హామీ, త్రాగు నీరు, రీ సర్వే & ఐవిఆర్ఎస్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సమీక్ష నిర్వహించారు.

## అక్షర ధాంను , అటల్ బ్రిడ్జిని సందర్శించిన తులసి రెడ్డి





**గుజరాత్ పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 9 :** గుజరాత్ రాష్ట్రంలో అహ్మదాబాద్లో అటల్ బ్రిడ్జిని, గాంధీ నగర్లో అక్షరధామ్ ను రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి మంగళవారం సందర్శించారు. అహ్మదాబాద్ మధ్యలో సబర్మతి నదీ ప్రవహిస్తుందని ,నదిపై అటల్ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించారని ,ఇది చూడదగ్గ పర్యాటక ప్రదేశమని తులసి రెడ్డి అన్నారు. గుజరాత్ రాష్ట్ర రాజధాని అయిన గాంధీ నగర్ లో 1992 లో స్వామి నారాయణ అక్షర ధాం హిందూ దేవాలయం ను నిర్మించారని, ఇది చూడదగ్గ ఆలయమని తులసి రెడ్డి అన్నారు. 2002 సెప్టెంబర్ 24 న అక్షర ధాం పై ఉగ్రవాదులు దాడి చేయగా 33 మంది చనిపోయారు,70 మంది గాయపడ్డారు. 64 ఏళ్ల తర్వాత గుజరాత్ రాష్ట్రంలో ఏ ఐ సీసీ సమావేశం జరుగుతోంది. 1961 లో నీలం సంజీవ రెడ్డి అధ్యక్షతన భావ్ నగర్లో ఏఐసీసీ సమావేశం జరిగింది. మళ్ళీ ఇప్పుడు అహ్మదాబాద్లో మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ సమావేశం జరుగుతోంది. సోనియా గాంధి, రాహుల్ గాంధీ,కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు,పీసీసీ అధ్యక్షులు,పార్లమెంటు సభ్యులు,ఏఐసీసీ సభ్యులు దాదాపు 1500 మంది కాంగ్రెస్ ముఖ్య నాయకులు సమావేశం లో పాల్గొంటారని తులసిరెడ్డి చెప్పారు. 8న సిడబ్ల్యుసి సమావేశం, 9వ తేదీన ఎఐసిసి సమావేశం జరుగుతాయి. తాజా రాజకీయ పరిస్థితులు,భవిష్య సవాళ్లు, పార్టీ బలోపేతానికి, పునరుజ్జీవనానికి తీసుకోవలసిన చర్యలపై చర్చలు,తీర్మానాలు వుంటాయని తులసి రెడ్డి అన్నారు.

# దుర్గ గుడి భూముల లీజు పొడిగింపు వివాదం

**విజయవాడ, ఏప్రిల్ 9, పెన్ పవర్:** విజయవాడలో దుర్గ గుడి భూముల లీజు వ్యవహారంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. నగరంలో ప్రధాన ప్రాంతంలో ఉన్న దాదాపు ఆరు ఎకరాల భూమి లీజు గడువు ముగియడంతో దానిని మరోమారు పొడిగించాలని లీజుదారుల నుంచి దేవాదాయ శాఖకు ప్రతిపాదనలు అందాయి. అందులో విద్యా సంస్థను నిర్వహిస్తుండటంతో మరో 50ఏళ్లకు పొడిగించాలని లీజుదారులు అభ్యర్థించారు. యాభై ఏళ్లుగా నామమాత్రపు ధరతో ఉన్న దుర్గగుడి భూముల లీజును మరోసారి పొడిగించే ప్రతిపాదనకు దేవాదాయ శాఖ అభ్యంతం తెలిపింది. యాభై ఏళ్ల తర్వాత ఏమి జరుగుతుందో తెలియనందున ఆలయ భూముల్ని సమగ్రంగా సర్వే చేసి వాటిని శాశ్వతంగగా డిజిటల్ రూపంలో భద్రపరిచిన తర్వాత లీజు ప్రక్రియపై ముందుకు వెళ్లాలని ఆ శాఖ కార్యదర్శి కమిషనర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో దుర్గామల్లేశ్వర దేవస్థానం నుంచి పటమట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలో 5.90ఎకరాల భూమిని లీజుకు తీసుకున్న సిద్ధార్థ అకాడమీ పేరిట లీజు పొడిగించాలని కొందరు అధికారులు, దేవాదాయ శాఖ అధికారులకు మౌఖికంగా సూచించారు. దీంతో లీజు ప్రతిపాదనల్ని దేవాదాయ శాఖ ఎస్టేట్స్, లీగల్ విభాగం క్షుణ్ణంగా అధ్యయనం చేసి చట్ట ప్రకారం సాధ్యం కాదని తేల్చేశారు. యాభై ఏళ్లకు లీజును పొడిగిస్తే అప్పటికి 100ఏళ్లు పూర్తై యాజమాన్య హక్కుల్ని దేవస్థానం కోల్పోతుందని, భూమికి శాశ్వత యజమానులుగా లీజుదారులు అవుతారని అభ్యంతరం అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో లీజు గడువును తగ్గించి పొడిగించాలనే సూచనలు అందాయి. ఇప్పటికే 50ఏళ్లుగా లీజు కొనసాగుతుండటంతో లీజు పొడిగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కొత్తగా మరోసారి లీజుకు తీసుకోవాల్సిందేనని కొత్త చట్టం ప్రకారమే లీజులు పొందాలని వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో దుర్గగుడి భూముల లీజు వ్యవహారాన్ని కొలిక్కి తెచ్చే బాధ్యత ఇంఛార్జి హోదాలో ఉన్న ఉన్నతాధికారి భుజాలకు ఎత్తుకున్నారు. పెద్దసార్ ఆదేశించారంటూ అధికారులపై ఒత్తిడి చేయడంతో లిఖిత పూర్వకంగా వివరణలు, ప్రతిపాదనలు ఇస్తే తప్ప తాము ముందుకు వెళ్లలేమని ఆ శాఖ అధికారులు తేల్చేశారు. దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం అవుతుండటంతో దేవాదాయ శాఖ చట్టానికి కొన్నేళ్ల క్రితం మార్పులు చేశారు. పాత చట్టంలో లీజుల పొడిగింపుకు అవకాశం ఉన్నా కొత్త చట్టంలో లీజు పొడిగింపు క్లాజ్ లేదని దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే 50ఏళ్లుగా లీజులో ఉన్న భూముల్ని మరోసారి పొడిగించడం ప్రస్తుత చట్టం ప్రకారం సాధ్యం కాదని, అలా చేయాలంటే క్యాబినెట్ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు. దేవాదాయ శాఖ భూమి లీజు వ్యవహారంపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తులో తలెత్తే న్యాయవివాదాలకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని భయపడుతున్నారు. ఈ క్రమంలో భూముల లీజు పొడిగించాలని ఒత్తిడి చేస్తోన్న అధికారినే ఏ నిబంధన ప్రకారం భూముల లీజు పొడిగించాలో ప్రతిపాదనలు పంపాలని దేవాదాయ శాఖ అధికారులు సూచించారు. వ్యవసాయేతర భూమిగా వినియోగంలో ఉన్న భూమి విలువను ఎలా నిర్ణయిస్తారో కూడా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు లక్షన్నర లీజుగా చెల్లిస్తుండగా 10శాతం పెంపుదలతో లక్షా 65వేలుగా లీజు ధరను ప్రతిపాదించడంపై కూడా దేవాదాయశాఖ అభ్యంతరం చెబుతోంది. చట్టంలో లీజు పొడిగింపు అవకాశం లేనపుడు బహిరంగంగా జరిగే ప్రక్రియలోనే భూమి ధరను ఖరారు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందులో విద్యా సంస్థలు కొనసాగుతుండటంతో బహిరంగ వేలాన్ని మినహాయించినా అద్దె ధరను మాత్రం మార్కెట్ ధరలకు అనుగుణంగా ఖరారు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. దేవాదాయ శాఖలో ఇన్‌ఛార్జి హోదాలో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి లీజు వ్యవహారంలో లిఖిత పూర్వకంగా ప్రతిపాదనలు చేయకుండా ముందుకు వెళ్లలేమని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. మౌఖిక ఆదేశాలను పాటిస్తే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు తాము బాధ్యత వహించాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో గతంలో కానూరు గ్రామ పంచాయితీ పరిధిలో సర్వే నంబర్ 282లో ఉన్న 12.39 ఎకరాల భూమిని యాభై ఏళ్లకు లీజుకు ఇవ్వాలని సిద్ధార్థ అకాడమీ 1997 నవంబర్ 25న కోరగా అప్పట్లో దేవాదాయ శాఖ లేవనెత్తిన అభ్యంతరాలను గుర్తు చేస్తున్నారు. దుర్గ గుడి భూముల లీజు వ్యవహారంలో మార్కెట్ ధరలకు అనుగుణంగా లేకపోతే నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. 1975-76 భూమిని లీజుకు ఇచ్చినపుడు మొదటి ఆరేళ్లు రూ.6వేల రుపాయలకు లీజుకు ఇచ్చారని తర్వాతి పదేళ్లకు రూ.7వేలు, తర్వాత పదేళ్లు 8వేలు, ఆ తర్వాత పదేళ్లు 9వేలు, ఆ తర్వాత పదేళ్లు 10వేలు, ఆ తర్వాత ఏడాదికి రూ.11వేల అద్దె చెల్లించేలా యాభై ఏళ్లకు లీజుకు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం సిద్ధార్థ అకాడమీ పేరిట విజయవాడ మొగల్రాజపురంలోని సర్వే నంబర్ 76లో 8.22 ఎకరాలు, పటమట సర్వే నంబర్ 17లో 5.98ఎకరాల భూమి సిద్ధార్థ అకాడమీ పేరిట లీజుకు ఉంది. 2012 నాటికి ఈ భూముల విలువ రూ.176.34కోట్లుగా నిర్ధారించారు. పటమటలో ఉన్న భూమికి గజం రూ.30వేల చొప్పున రూ.86.83కోట్లు, మొగల్రాజపురంలో ఉన్న భూమికి గజం రూ.22,500 చొప్పున రూ.89.51కోట్లుగా ఉంది. ప్రస్తుతం ఈ విలువలు భారీగా పెరిగాయని దేవాదాయ శాఖకు వచ్చే ఆదాయం ఆ స్థాయిలో లేదని దేవాదాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

# సజ్జల స్థానంలో సతీష్ రెడ్డి

**కడప, ఏప్రిల్ 9, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ లో జగన్మోహన్ రెడ్డి విధేయత కలిగిన నేతలు చాలామంది ఉన్నారు. ఆయన చుట్టూ పార్టీకి స్తంభాల వ్యవహరించే నాయకులు ఉన్నారు. అయితే వారిపై 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. విమర్శలు వ్యక్తమయ్యాయి. వారి పేరు చెప్పి చాలామంది నేతలు పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఆ కీలక నాయకుల్లో ఒకరైన విజయసాయిరెడ్డి సైతం పార్టీ నుంచి బయటికి వెళ్లిపోయారు. జగన్మోహన్ రెడ్డి పార్టీ ఏర్పాటు చేయక ముందు నుంచే ఆయనకు సన్నిహితుడు విజయసాయిరెడ్డి. వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి ఆడిటర్ గా ఉన్న విజయసాయి కాలక్రమంలో జగన్మోహన్ రెడ్డికి అత్యంత నమ్మిన బంటుగా మారిపోయారు. అటువంటి వ్యక్తి పార్టీ నుంచి బయటకు వెళ్లే క్రమంలో అనేక రకాల ఆరోపణలు చేశారు. కోటరీని మార్చుకోకుంటే మాత్రం జగన్మోహన్ రెడ్డికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. పరోక్షంగా వైవి సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి ల పై సంచలన ఆరోపణలు చేశారు విజయసాయిరెడ్డి. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి పార్టీలో కీలక నియామకాలు చేపడుతున్నారు. అందులో భాగంగా సజ్జల రామకృష్ణారెడ్డి బాధ్యతల నుంచి తొలగిస్తుండడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత సజ్జల చుట్టూ వివాదాలు నడిచాయి. చాలామంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లు సజ్జలపై ఆరోపణలు చేశారు. ఆయన తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. అయినా సరే జగన్మోహన్ రెడ్డి మాత్రం సజ్జల రామకృష్ణారెడ్డికి అవకాశం ఇస్తూనే ఉన్నారు. ఏకంగా ఆయనకు రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకునే బాధ్యతలు అప్పగించారు. ఇటీవల విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యల నేపథ్యంలో సజ్జలను జగన్మోహన్ రెడ్డి మార్పు చేయడం మాత్రం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు భార్గవరెడ్డిని సోషల్ మీడియా ఇన్చార్జి పదవి నుంచి తొలగించారు. ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డికి సైతం రాష్ట్ర సమన్వయకర్త పదవి నుంచి తొలగించారు. దీంతో జగన్మోహన్ రెడ్డికి తత్వం బోధపడినట్లు అయింది. మరోవైపు సజ్జల రామకృష్ణారెడ్డి ఖాళీ చేసిన రాష్ట్ర సమన్వయకర్త పదవిని తన సొంత నేతకు అప్పగించుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. 2024 ఎన్నికలకు ముందు టిడిపి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సతీష్ రెడ్డికి ఇవ్వాలని ఒక నిర్ణయానికి వచ్చారు. సతీష్ రెడ్డి సుదీర్ఘకాలం వైయస్సార్ కుటుంబం పై పోటీ చేస్తూ వచ్చారు. ముందుగా రాజశేఖరరెడ్డి, తరువాత జగన్మోహన్ రెడ్డి లపై పోటీ చేస్తూ వచ్చిన ఆయనకు 2024 ఎన్నికల్లో టికెట్ నిరాకరించారు చంద్రబాబు. ఆ ఎన్నికల్లో బీటెక్ రవికి అవకాశం కల్పించడంతో బయటకు వచ్చేసారు సతీష్ రెడ్డి. అయితే పార్టీ ఓటమి తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డి పై అభిమానంతో అదే పార్టీలో కొనసాగుతున్నారు. చాలా యాక్టివ్ గా పని చేస్తున్నారు. అందుకే రాష్ట్ర సమన్వయ బాధ్యతలను సతీష్ రెడ్డికి అప్పగించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. అయితే సజ్జల రామకృష్ణారెడ్డికి వేరే బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. కానీ సజ్జలను రాష్ట్ర సమన్వయకర్త బాధ్యతలు నుంచి తొలగిస్తే మాత్రం ఆయన ఇబ్బంది పడక తప్పదు. ఇప్పటికే సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు అజ్ఞాతంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కేసులకు భయపడి దూరంగా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇటువంటి సమయంలో సజ్జల రామకృష్ణారెడ్డికి సైతం ఆ పదవులను దూరం చేస్తుండడం మాత్రం కొత్త ఆలోచనలు తెరపైకి వస్తున్నాయి. సజ్జలకు పొమ్మనలేక పొగ పెడుతున్నారా అన్న అనుమానాలు కూడా తలెత్తుతున్నాయి.



# తీరానికి వాడేసుకుంటున్న కూటమి సర్కార్

**కాకినాడ, ఏప్రిల్ 9, పెన్ పవర్:** ఏపీ సీఎం చంద్రబాబు అంది వచ్చిన ఏ అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు సైతం ఆయన ప్రయత్నిస్తూనే ఉన్నారు. అటు కేంద్రం సైతం ఏపీకి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల విషయంలో ఇప్పటికే దూకుడుగా ఉంది ఏపీ ప్రభుత్వం. కొద్ది నెలల కిందట విశాఖ కేంద్రంగా రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు ప్రధాని మోదీ. ఇప్పుడు ఉత్తరాంధ్రలో నేవీకి సంబంధించి యుద్ధ నౌకల కేంద్రంతో పాటు ఆయుధ డిపో ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చింది. ఈ విషయంలో చంద్రబాబు అత్యంత చొరవ తీసుకుంటున్నారు. ఇండియన్ నేవీ కి భూములను కేటాయించి.. ఇక్కడ ఏర్పాటు అయ్యేలా కేంద్రాన్ని ఒప్పిస్తున్నారు. తూర్పు కోస్తాప్రాంతంగా విశాఖకు గుర్తింపు ఉంది. ఇప్పటికే నేవీ కార్యకలాపాలకు కేంద్రంగా మారింది విశాఖ నగరం. తూర్పు కోస్తా తీర పరిరక్షణకు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది మొదలు.. నావీ సేవలను విస్తృత పరుస్తూ వస్తోంది. అందులో భాగంగా దేశానికి అవసరమైన యుద్ధ నౌకల తయారీ కేంద్రం, ఆయుధ డిపోను ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి స్థలం అవసరం అని కేంద్రం కోరింది. దానికి భూమిని సమకూర్చే పనిలో పడింది చంద్రబాబు సర్కార్. ఈ రెండు ఏర్పాటు అయితే ఏపీకి జాతీయ పరంగా ప్రత్యేక గుర్తింపు దక్కినట్టే. ఉద్యోగ ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడే అవకాశం ఉంది. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా తూర్పు కోస్తా నావికాదళం కొనసాగుతోంది. దేశంలోనే విస్తృత సేవలు అందిస్తోంది ఈ ప్రాంతీయ కార్యాలయం. ఇప్పుడు మరో ముందడుగు వేసింది. విశాఖకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాంబిల్లిలో యుద్ధనౌకల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది నావికాదళం. దీనికి గాను రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. దీనిపై శరవేగంగా స్పందించింది చంద్రబాబు సర్కార్. అక్కడ భూముల ఏర్పాటుకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాంబిల్లిలో 32 యుద్ధ నౌకలు నిలిపేలా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అనుసంధానంగా కేంద్ర ప్రభుత్వమే ఒక పోర్టు ఏర్పాటు చేయనుంది. అదే జరిగితే భారీ ఎత్తున ఉద్యోగాల కల్పన జరుగుతుందని నావికాదళం అధికారులు చెబుతున్నారు. ఇంకోవైపు విజయనగరం జిల్లా బాడంగిలో నావికాదళానికి సంబంధించి ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో అక్కడ ఒక ఎయిర్పోర్ట్ ఉండేది. కాలక్రమంలో అది కనుమరుగయింది. కానీ ఆ ఎయిర్ క్రాఫ్ట్ భూములు మాత్రం రైతుల ఆధీనంలో ఉన్నాయి. ఒకవైపు అదే జిల్లాలోని భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్పోర్ట్ నిర్మాణం.. ఇంకోవైపు రైల్వే మార్గం.. మరోవైపు జాతీయ రహదారులు ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని బాడంగిలో నావికాదళం ఆయుధం డిపో ఏర్పాటుకు దేశస్థాయి అధికారులు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

మొత్తానికి అయితే చంద్రబాబు సర్కార్ తీర ప్రాంతాన్ని రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు వినియోగించుకుంటోంది. ఇప్పటికే విశాఖను పర్యాటకంగా, పారిశ్రామిక హబ్ గా మార్చేందుకు చంద్రబాబు సర్కార్ కృత నిశ్చయంతో ఉంది. ఐటీ పరంగా చాలా సంస్థలను ఇక్కడ నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పలు అంతర్జాతీయ సంస్థలు సైతం తమ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధపడుతున్నాయి. ఒకవైపు పారిశ్రామికం, ఇంకో వైపు ఐటి, మరోవైపు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో విశాఖ దేదీప్యమానంగా వెలగనుంది. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల సరసన చేరనుంది.




# బిగ్ బాస్ లోకి అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్



**రాజమండ్రి ఏప్రిల్ 9, పెన్ పవర్:** ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది ఎవరైనా ఉన్నారంటే వారు 'అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్. గత 4 రోజులుగా నెట్టింట వీరిపై ఒకటే ట్రోల్స్, మీమ్స్, క్లారిఫికేషన్ వీడియోస్, అపాలజీ వీడియోస్. చాలాకాలంగా పచ్చళ్ల వ్యాపారం చేస్తూ కస్టమర్లపై బూతులతో విరుచుకుపడడంతో వీరిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ప్రముఖ రియాల్టీ షో బిగ్ బాస్‌లో అలేఖ్య చిట్టి, రమ్య సిస్టర్స్‌లో ఒకరికి ఛాన్స్ వస్తుందనే వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. బిగ్ బాస్ సీజన్ 9 త్వరలోనే కొన్ని నెలల్లో ప్రారంభం కానుండగా.. ప్రతి ఏడాది ఆగస్ట్ లేదా సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో ప్రోగ్రాం స్టార్ట్ అయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో కంటెస్టెంట్స్ ఎంపిక, బిగ్ బాస్ ప్రోగ్రాం నిర్వహణ పనుల్లో టీం ఉంది. సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయిన వారికి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు బిగ్ బాస్ ఎంట్రీ దక్కుతుంది. 'అలేఖ్య చిట్టి పికిల్స్' సిస్టర్స్‌పై మీమ్స్, ట్రోల్స్, వీడియోలు 100 మిలియన్స్‌కు పైగా వీడియోలతో ట్రెండ్ అవుతున్నాయి. దీంతో వీరిలో ఒకరికి ఛాన్స్ దక్కే అవకాశాలున్నాయని నెట్టింట చర్చ సాగుతోంది. అలేఖ్య చిట్టి పికెల్స్' సిస్టర్స్‌లో రీల్స్‌తో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న రమ్యకే ఆ అవకాశం ఉంటుందని నెటిజన్లు అంటున్నారు. మోడ్రన్ డ్రెస్సుల్లో ఆమె చేసిన రీల్స్ ఎక్కువగా ట్రెండ్ అవుతుండడమే దీనికి కారణమని చెబుతున్నారు. తాజాగా, జియో హాట్ స్టార్‌లో పికిల్స్‌కు సంబంధించి ఓ సీన్ సైతం వీడియో షేర్ చేశారు. ప్రభాస్ ఛత్రపతి సినిమాలో ఓ సీన్‌తో వీడియో విడుదల చేశారు. తాజాగా, బిగ్ బాస్ ఆదిరెడ్డి కూడా తన యూట్యూబ్ ఛానల్‌లో ఈ విషయంపై స్పందించారు. వారిలో ఒకరు బిగ్ బాస్‌కు రావొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజమండ్రి వేదికగా 'అలేఖ్య చిట్టి పికిల్స్' పేరుతో ముగ్గురు సిస్టర్స్ సుమ కంచర్ల, అలేఖ్య చిట్టి, రమ్య మోక్ష కంచర్ల (రమ్య గోపాలకృష్ణ) సోషల్ మీడియాలో పచ్చళ్ల వ్యాపారం ప్రారంభించారు. వీరిలో రమ్య తన రీల్స్‌తోనూ పాపులర్ అయ్యారు. తమను విమర్శించిన వారిపై అంతేస్థాయిలో సోషల్ మీడియా వేదికగా విమర్శలు సైతం చేశారు. అయితే పచ్చళ్ల ధరలు ఎక్కువగా ఉన్నాయంటూ ప్రశ్నించిన ఓ నెటిజన్‌కు వీరిలో ఓ అమ్మాయి అలేఖ్య అతనిపై బూతులతో విరుచుకుపడింది. ఈ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇదే సమయంలో తమను కూడా అలానే తిట్టిందంటూ మరిన్ని ఆడియో లీక్స్ బయటకు వచ్చాయి. దీంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లపై ట్రోలింగ్ మొదలైంది. అంత దారుణంగా ఎలా తిడతారంటూ కామెంట్స్ చేశారు. దీంతో అక్క సుమ కంచర్ల తాను తిట్టలేదని.. తనను ట్రోల్ చెయ్యొద్దని వేడుకున్నారు. ఈ అంశంపై వివాదం ముదురుతున్న వేళ అలేఖ్య ఎట్టకేలకు సారీ చెప్పారు. తాను తప్పు చేశానని.. తాను ఎవరినైతే ఇప్పటివరకూ తిట్టానో వాళ్లందర్నీ సారీ అడుగుతున్నట్లు ఓ వీడియో విడుదల చేశారు. దీంతో ఈ వివాదానికి ఎండ్ కార్డ్ పడినట్లే అనిపిస్తున్నప్పటికీ ఇంకా ట్రోలింగ్ మాత్రం కొనసాగుతూనే ఉంది.

# రజనీని అడ్డంగా బుక్ చేస్తున్న ఎంపీ

**గుంటూరు, ఏప్రిల్ 9, పెన్ పవర్:** వైసిపి నేతల విషయంలో టిడిపి నేతలు కొంతమంది కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు కొంతమంది టీడీపీ నేతలు గతంలో తమ ఇబ్బంది పెట్టిన నాయకుల విషయంలో వెనక్కు తగ్గడం లేదు. ఈ విషయంలో పల్నాడు జిల్లా ముందుంటుంది. నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు వర్సెస్ చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి విడుదల రజిని ల మధ్య వాతావరణం చినికి చినికి గాలి వానగా మారింది. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎంపీ కంటే మంత్రిగా ఉన్న రజిని పవర్ ఫుల్ గా ఉండేవారు. ఆమె మాటకు వైసీపీ అధిష్టానం వద్ద కాస్త వెయిట్ ఎక్కువగా ఉండేది. దీనితో రజిని ఆడిందే ఆట పాడిందే పాటగా ఉండేది. దీనికి తోడు అధికారులు కూడా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆమెకు పెద్ద ఎత్తున సహకరించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇలా సహకరించబట్టే ఐపీఎస్ అధికారులను అడ్డం పెట్టుకుని.. ఒక స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి ఏకంగా రెండు కోట్ల రూపాయలు రజనీ తీసుకున్నారు అనేది టీడీపీ ప్రధాన ఆరోపణ. ఇక రజనీ విషయంలో లావు కృష్ణదేవరాయలు ఇప్పుడు దూకుడుగా ఉన్నారు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన తర్వాత మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. లావు కృష్ణదేవరాయలపై ఆరోపణలు చేసిన రజిని ఆ తర్వాత ఎంపీ ఇచ్చిన స్ట్రోక్ కి కంగుతిన్నారు. ఆమె మొదలు పెట్టారని తాను ఆపే ప్రసక్తే లేదని.. ఇది ఎక్కడ వరకు వెళుతుందో చూడాలంటూ లావు కృష్ణదేవరాయలు ఘాటుగా మాట్లాడారు. చాలెంజ్ కు తగ్గట్టు ఇప్పుడు రజిని వ్యవహారాలపై ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆమె చేసిన అక్రమాలకు.. సంబంధించి నివేదికలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో పాటుగా కేంద్ర ప్రభుత్వం పెద్దలకు కూడా ఇస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రైతుల భూముల విషయంలో ఆమె అనుసరించిన వైఖరి, పాల్పడిన అక్రమాలపై సాక్షా లతో సహా ఆయన ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఆమె మరిది గోపిని అడ్డం పెట్టుకొని ఆమె పెద్ద ఎత్తున చిలకలూరిపేట నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడ్డారు అనేది ఎంపీ ఆరోపణ. ఇప్పుడు వాటిని రుజువు చేసేందుకు పక్కా.. ఆధారాలతో ఆయన రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. తాజాగా చిలకలూరిపేటలో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ లో కొంతమంది రైతులు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు కూడా చేసారు. రజనీ పై చర్యలు తీసుకోవాలని ఆమె మరిది గోపి పై కేసు నమోదు చేయాలని కోరారు. ఇలాగే మరికొన్ని కేసులు బయటకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించిన వ్యవహారంలో ఏసీబీ అధికారులు గవర్నర్ అనుమతి తీసుకునే కేసు నమోదు చేశారు. దీనితో భవిష్యత్తులో రజనీకి ఇబ్బందులు తప్పవని.. ముఖ్యంగా లావు కృష్ణదేవరాయల నుంచి ఆమె మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొక తప్పదని, ఇదే ఆమె రాజకీయ జీవితాన్ని నాశనం చేసినా ఆశ్చర్యం లేదంటూ కొంతమంది కామెంట్ చేస్తున్నారు.

# టీడీపీ నేతలదే హవా...

**విజయనగరం, ఏప్రిల్ 9, పెన్ పవర్:** ఏపీలో కూటమి ఏకపక్ష విజయం దక్కించుకున్న జిల్లాల్లో విజయనగరం ఒకటి. దాదాపు అన్ని నియోజకవర్గాలను కైవసం చేసుకుంది కూటమి. బలమైన బొత్స సామ్రాజ్యం కూలిపోయింది. ఆ కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఓటమి చవిచూశారు. అయితే ఇంతటి విజయాన్ని నిలుపుకోలేని స్థితిలో ఉంది కూటమి. అధికారంలోకి వచ్చిన పది నెలలకే విభేదాల పర్వం మొదలైంది. పతాక స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లిమర్లలో పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే వర్సెస్ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి అన్నట్టు పరిస్థితి మారింది. రెండు పార్టీల అధినాయకత్వాలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా ఈ ఇద్దరు నేతలు పట్టించుకోవడం లేదు. దీంతో ఇక్కడ కూటమిలో అడ్డగోలు చీలిక కనిపిస్తోంది.

2024 ఎన్నికల్లో పొత్తులో భాగంగా నెల్లిమర్ల నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ తరపున లోకం మాధవి పోటీ చేశారు. టిడిపి శ్రేణులు సహకరించడంతో భారీ మెజారిటీతో గెలిచారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మాధవి టిడిపి శ్రేణులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శ ఉంది. టిడిపిని కాదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన వారికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. తనకంటూ నియోజకవర్గంలో ఒక సొంత క్యాడర్ను తయారు చేసుకునే పనిలో పడ్డట్టు తెలుస్తోంది. 2019లో కేవలం 5000 ఓట్ల వరకు మాత్రమే తెచ్చుకున్నారు మాధవి. అందుకే ముందు జాగ్రత్త చర్యగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను తన వైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. గత ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తూ వచ్చారు నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు. తనకే టికెట్ వస్తుందని ఆయన ఆశలు పెట్టుకున్నారు. పార్టీ కోసం బాగానే ఖర్చు పెట్టారు. లోకేష్ పాదయాత్ర ముగింపును తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయించారు. అయితే ఇక్కడ టిడిపికి మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు ఉండేవారు. ఆయన వయోభారంతో పక్కకు తప్పుకోవడంతో బంగార్రాజుకు నియోజకవర్గ టిడిపి బాధ్యతలు అప్పగించారు. దీంతో తనకు టికెట్ ఖాయమని భావించిన కర్రోతు బాగానే కష్టపడ్డారు. పొత్తులో భాగంగా ఈ సీటును జనసేనకు కేటాయించడంతో బాధపడ్డారు. కానీ చంద్రబాబు సముదాయించడంతో జనసేన అభ్యర్థి లోకం మాధవి గెలుపు కోసం కృషి చేశారు. అయితే ఇప్పుడు అదే కర్రోతును నిర్లక్ష్యం చేస్తున్నారు ఎమ్మెల్యే మాధవి. టిడిపి క్యాడర్ తో పాటు నాయకత్వాన్ని నిర్వీర్యం చేసే పనిలో పడ్డారు. అందుకే ఇక్కడ విభేదాలు రోజు రోజుకు ముదురుతున్నాయి. పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. ఎత్తుకు పైఎత్తులు అన్నట్టు సాగుతున్నాయి.

## జట్టుకు భారంగా మారాడంటూ విమర్శలు... ధోనీపై రాబిన్ ఉతప్ప ఆసక్తికర వ్యాఖ్యలు

- ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో ఆడలేకపోతున్న సీఎస్‌కే
- ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగింట ఓటమి
- ధోనీ జట్టుకు భారంగా మారాడనే వ్యాఖ్యలు
- చెన్నై టీమ్‌కు ధోనీ ఎప్పటికీ సమస్య కాదన్న రాబిన్ ఉతప్ప
- ప్రస్తుతం జట్టు మార్పు దశలో ఉందన్న మాజీ ప్లేయర్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో ఆడలేక చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) అభిమానులను తీవ్రంగా నిరాశపరుస్తున్న విషయం తెలిసిందే. వరుసగా నాలుగు ఓటములతో ఆ జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. ఆడిన ఐదు మ్యాచ్ లలో ఒక్క విజయం మాత్రమే నమోదు చేసింది. నిన్నటి మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్)పై చివరి వరకు పోరాడినా విజయాన్ని మాత్రం అందుకోలేక పోయింది. 18 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఇక మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గత నాలుగు మ్యాచుల్లో లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌కు రాగా... నిన్న మాత్రం ప్రమోషన్ పొంది ఐదో స్థానంలో క్రీజులోకి వచ్చాడు. 12 బంతుల్లోనే 27 రన్స్ బాదాడు. కాగా, ఈ మ్యాచ్ ముందు వరకు ధోనీ జట్టుకు భారంగా మారాడనే వ్యాఖ్యలు వినిపించాయి. ఈ నేపథ్యంలో సీఎస్‌కే మాజీ ప్లేయర్ రాబిన్ ఉతప్ప... ఎంఎస్‌డీ విషయమై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. చెన్నై టీమ్‌కు ధోనీ విషయం ఎప్పటికీ సమస్య కాదని, ప్రస్తుతం జట్టు మార్పు దశలో ఉందని పేర్కొన్నాడు.

రాబిన్ ఉతప్ప మాట్లాడుతూ... "ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌పై ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు. చెన్నై జట్టుకు ఒక భారంగా ధోనీ ఎప్పటికీ మారడు. అతని ఆటతీరులో దూకుడు లేదనే వ్యాఖ్యలు సరికాదు. రాబోయే కాలంలో సీఎస్‌కే నుంచి ఏం ఆశిస్తున్నారనేది ఎంఎస్‌డీకి బాగా తెలుసు. ఇప్పుడు చెన్నై సూపర్ కింగ్స్ జట్టు మార్పుల దశలో ఉంది. తప్పకుండా అన్ని సమస్యలకు ముగింపు దక్కుతుందని ఆశిస్తున్నా" అని మాజీ ఆటగాడు అన్నాడు.

## మా లీగ్ మొదలవుతుంది.. IPL వదిలేసి PSL చూస్తారు: పాకిస్థాన్ స్టార్ పేసర్




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులని అలరించడానికి మరో ధనాధన్ టీ20 లీగ్ సిద్ధంగా ఉంది. మరో రెండు రోజుల్లో పాకిస్థాన్ సూపర్ లీగ్ 2025 పదో ఎడిషన్ ప్రారంభం కానుంది. ఏప్రిల్ 11న ప్రారంభం కానున్న ఈ టోర్నీ మే 18న ఫైనల్ తో ముగుస్తుంది. ఈ టోర్నీ ప్రారంభానికి ముందు పాకిస్థాన్ లో పండగ వాతావరణం నెలకొంది. తొలిసారి పాకిస్థాన్ సూపర్ లీగ్ ఐపీఎల్ తో పోటీ పడనుండడం ఆసక్తికరంగా మారింది. ఐపీఎల్ తర్వాత పాకిస్థాన్ సూపర్ లీగ్ ను ఎక్కువగా చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపిస్తారు. ఈ సారి రెండు లీగ్స్ క్లాష్ అవ్వడంతో క్రికెట్ ఫ్యాన్స్ కు డబుల్ కిక్ లభించనుంది.

ఈ టోర్నీకి ముందు పాకిస్థాన్ స్టార్ ఫాస్ట్ బౌలర్ హసన్ అలీ సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన బోల్డ్ స్టేట్ మెంట్ తో ఆశ్చర్యానికి గురి చేశాడు. హసన్ మాట్లాడుతూ.. "అభిమానులు మా టోర్నమెంట్‌ను చూస్తారు. మా టోర్నమెంట్ లో ఫ్యాన్స్ కు మంచి వినోదం దొరుకుతుంది. మేము పాకిస్థాన్ సూపర్ లీగ్ లో బాగా ఆడితే ప్రేక్షకులు ఐపీఎల్ వదిలేసి మా లీగ్ చూస్తారు". అని చెప్పాడు. హసన్ పాకిస్థాన్ సూపర్ లీగ్ లో కరాచీ సూపర్ కింగ్స్ తరపున వార్నర్ కెప్టెన్సీలో ఆడనున్నాడు.ఇప్పటివరకు ఈ టోర్నీలో 82 మ్యాచ్ ల్లో 108 వికెట్లు పడగొట్టాడు. మరో 6 వికెట్లు తీస్తే ఈ లీగ్ లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా చరిత్ర సృష్టిస్తాడు. డిఫెండింగ్ ఛాంపియన్స్ గా ఇస్లామాబాద్ యునైటెడ్ బరిలోకి దిగుతుంది. టోర్నీ తొలి మ్యాచ్ లో లాహోర్ ఖలందర్స్ తో ఇస్లామాబాద్ యునైటెడ్ తలపడనుంది. రావల్పిండి వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. రావల్పిండి క్వాలిఫైయర్ 1తో సహా టోర్నమెంట్‌లోని 11 మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనుంది. లాహోర్‌లోని ఐకానిక్ గడాఫీ స్టేడియంలో ఫైనల్, ఎలిమినేటర్స్ తో సహా మొత్తం 13 మ్యాచ్ లు జరుగుతాయి. కరాచీలోని నేషనల్ స్టేడియం, ముల్తాన్ చెరో ఐదు మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. మొత్తం 6 జట్లు (ఇస్లామాబాద్ యునైటెడ్, లాహోర్ ఖలందర్స్,పెషావర్ జల్మీ, క్వెట్టా గ్లాడియేటర్స్,కరాచీ కింగ్స్, ముల్తాన్ సుల్తాన్స్) టైటిల్ కోసం తలపడనున్నాయి.

## అప్పుడు వరల్డ్ కప్ ఫైనల్.. ఇప్పుడు ఐపీఎల్: యాక్టింగ్‌తో మ్యాచ్ ఫలితాన్ని మార్చేసిన పంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో మంగళవారం (ఏప్రిల్ 8) మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ పై లక్నో సూపర్ జయింట్స్ థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన హై స్కోరింగ్ మ్యాచ్ లో 4 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది.మొదట బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో కోల్‌కతా నైట్ రైడర్స్ 7 వికెట్లను 234 పరుగులు చేసి ఓడిపోయింది. భారీ స్కోర్ కళ్ళ ముందు కనబడుతున్నా కోల్‌కతా పోరాడిన తీరు అద్భుతం. టాపార్డర్ లో సునీల్ నరైన్ (13 బంతుల్లో 30) తో పాటు కెప్టెన్ రహానే (35 బంతుల్లో 61:8 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడారు. నరైన్ ఔటైనప్పటికీ వెంకటేష్ అయ్యర్ తో రహానే ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లాడు. ఇద్దరూ జాగ్రత్తగా ఆడడంతో కేకేఆర్ విజయం దిశగా పయనించింది. 12 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసిన కేకేఆర్ మరో 8 ఓవర్లలో 90 పరుగులు చేస్తే గెలుస్తుంది. చేతిలో 8 వికెట్లు ఉండడంతో కేకేఆర్ విజయం ఖాయమనిపించింది.

ఈ దశలో లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ తన తెలివిని ప్రదర్శించాడు. తనకు తిమ్మిర్లు వచ్చాయని ఫిజియోనీ పిలిపించాడు. దీంతో గ్రౌండ్ లో కాసేపు ఆటకు అంతరాయం కలిగింది. మధ్యలో బ్రేక్ రావడం లక్నోకి బాగా కలిసి వచ్చింది. 13 ఓవర్ నుంచి కోల్ కతా వరుసగా వికెట్లను కోల్పోతూ వస్తుంది. 7 ఓవర్లలో 77 పరుగులు చేయాల్సిన దశలో రహానే ఔట్ కావడంతో కోల్‌కతా ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ తర్వాత వెంటనే రఘువంశీ, రమణ్ దీప్ సింగ్ పెవిలియన్ కు చేరారు. ఆంద్రీ రస్సెల్, వెంకటేష్ అయ్యర్ పెవిలియన్ బాట పట్టడంతో కేకేఆర్ ఓటమి దిశగా పయనించింది. చివర్లో రింకూ సింగ్ పోరాడినప్పటికీ విజయానికి 4 పరుగుల దూరంలో నిలిచిపోయింది. టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తెలివితేటలు భారత్ కు కప్ అందించడంలో సహాయం చేశాయి. క్లాసెన్, మిల్లర్ మ్యాచ్ ముగించేలా ఉన్న సమయంలో గాయం సాకుతో పంత్ సమయాన్ని వృథా చేశాడు. ఇలా చేయడం టీమిండియాకు అనుకూలంగా మారింది. ఆ నాలుగైదు నిమిషాలలో క్లాసెన్ ఏకాగ్రత కోల్పోయాడు తెలిపాడు. ఫైనల్ తర్వాత తాను కావాలనే యాక్టింగ్ చేశానని పంత్ చెప్పడం విశేషం. మరోసారి ఐపీఎల్ లో పంత్ అదే సీన్ రిపీట్ చేయడం లక్నో విజయానికి కారణమైంది.

# కీర్తి లీగ్ లోనే ఉంది.. రుక్మిణి ఛాన్స్ కొట్టేసింది..!



ట్రెండీ అవుట్‌ఫిట్‌లో తమన్నా సాసీ లుక్



మహానటిగా సినీ ప్రియుల మన్ననలను పొందిన కీర్తి సురేష్ నటిగా తనని తాను ప్రూవ్ చేసుకుంటూ వచ్చింది. ఎలాంటి ఛాలెంజింగ్ రోల్ అయినా కూడా తన దాకా వస్తే పాత్రలో పరకాయ ప్రవేశం చేసి అదరగొట్టేస్తుంది అమ్మడు. ఐతే పెళ్లి తర్వాత ఎవరికైనా అవకాశాలు కాస్త సన్నగిల్లుతాయన్న పరిస్థితి ఉంటుంది. ఐతే కీర్తి సురేష్ విషయంలో కూడా అలాంటిది ఉంటుందని అనుకున్నారు. కానీ ఆమెకు వస్తున్న ఆఫర్లు చూస్తే అది నిజం కాదన్నదని అర్ధమవుతుంది.

ముఖ్యంగా పెళ్లైన కీర్తి సురేష్ ఒక ఆరు నెలలుగా ఎలాంటి కొత్త సినిమాకు సైన్ చేయలేదు. ఐతే ఆ టైం లో కీర్తి పని అయిపోయిందని అనుకున్నారు అందరు. కానీ వరుసగా ఆమె సైన్ చేసిన సినిమాల గురించి బయటకు వస్తున్న న్యూస్ లు చూసి అందరు షాక్ అవుతున్నారు. కీర్తి సురేష్ తెలుగులో రెండు భారీ సినిమాలకు సైన్ చేసిందని తెలుస్తుంది. కీర్తి ఇప్పటికే విజయ్ దేవరకొండతో కలిసి జత కడుతున్నట్టు టాక్.విజయ్ దేవరకొండతో రవికిరణ్ కోలా డైరెక్షన్ లో వస్తున్న సినిమాలో కీర్తి లక్కీ ఆఫర్ అందుకుంది. ఈ సినిమాలో ముందు సప్త సాగరాలు దాటి హీరోయిన్ రుక్మిణి వసంత్ ని తీసుకోవాలని అనుకున్నారట. ఆ సినిమా కన్నడలో హిట్టైనా తెలుగులో ఆమెకు సూపర్ ఫ్యాన్స్ ఏర్పడ్డారు. ఈ క్రమంలో రుక్మిణికి రౌడీ హీరో సినిమా ఛాన్స్ వస్తుందని అనుకున్నారు. కానీ ఇప్పుడు రుక్మిణి కాదు ఆ అవకాశం కీర్తి సురేష్ కే ఇచ్చారని తెలుస్తుంది.ఇదే కాదు కీర్తి సురేష్ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ వచ్చింది. బలగం సినిమా చేసిన వేణు యెల్దండి నెక్స్ట్ చేయబోతున్న ఎల్లమ్మ సినిమాలో కీర్తి సురేష్ ఆఫర్ పట్టేసిందట. ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు చాలా వెయిట్ ఉంటుందని తెలుస్తుంది. తప్పకుండా ఈ సినిమాలతో అమ్మడు అదరగొట్టబోతుందని టాక్. ఇవే కాదు స్టార్ లీగ్ లో తాను ఉన్నానని అనేలా అమ్మడు ప్రూవ్ చేసుకుంటుంది. తమిళ్ లో మొన్నటిదాకా సినిమాలు చేసిన కీర్తి సురేష్ తెలుగులో చివరగా భోళా శంకర్ సినిమా చేసింది. దసరాలో వెన్నెల పాత్రలో ఇంప్రెస్ చేసిన కీర్తి భోళా శంకర్ తో నిరాశపరచింది. ఇక ఆ తర్వాత నెక్స్ట్ సినిమాలతో మరోసారి ఆకట్టుకోబోతుంది.



ఖుషీ కపూర్ యొక్క రవిషింగ్ పోజులు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com